





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక · PEN POWER TELUGU DAILY · ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 | సంచిక : 6 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 25 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# ఫ్రీ కరెంట్

## గణేశ్ మండపాలకు, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



- వినాయక చవితి వేళ తియ్యని కబురు చెప్పిన తెలంగాణ ప్రభుత్వం
- అనుమతి ఉన్న మండపాలకే ఈ సౌకర్యం వర్తింపు
- ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలు
- వేగంగా జరుగుతున్న హైదరాబాద్ గణేశ్ మండపాల ఏర్పాటు
- తుది దశకు చేరిన ప్రఖ్యాత ఖైరతాబాద్ గణపతి విగ్రహం పనులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పండుగ వాతావరణం నెలకొంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు ఒక తీపికబురు అందించింది. వినాయక చవితి, దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్, దుర్గామాత మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని, అయితే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేసింది.
ఈ నెల 27వ తేదీ నుంచి గణేశ్ చతుర్థి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ నిర్ణయంపై నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మండపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ నిర్మాణ పనులు తుది ఘట్టానికి చేరుకున్నాయి.
ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించడంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండపాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది.



# ముగిసిన సురవరం అంతిమయాత్ర...

## భౌతికకాయం గాంధీ ఆసుపత్రికి అప్పగింత

- సీపీఐ సీనియర్ నేత సురవరంకు కన్నీటి వీడ్కోలు
- అధికార లాంఛనాలతో అంతిమయాత్ర
- ఎర్ర జెండాలతో పాల్గొన్న సీపీఐ కార్యకర్తలు
- గన్ సెల్యూట్ సమర్పించిన పోలీసులు





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర ఆదివారం ప్రభుత్వ అధికార లాంఛనాలతో ముగిసింది. పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు, వేలాది మంది కార్యకర్తలు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు గాంధీ మెడికల్ కాలేజీకి దానం చేసి ఆదర్శంగా నిలిచారు.
హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ నుంచి సుధాకర్ రెడ్డి అంతిమయాత్ర ప్రారంభమైంది. పోలీసు బ్యాండ్ వాయిద్యాల నడుమ సాగిన ఈ యాత్రలో పార్టీ కార్యకర్తలు ఎర్ర జెండాలతో పాల్గొన్నారు. 'కామ్రేడ్ సుధాకర్ రెడ్డి అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. పూలతో అలంకరించిన వాహనంపై ఉంచిన ఆయన పార్థివదేహానికి 'లాల్ సలాం' చెబుతూ నివాళులర్పించారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వద్దకు యాత్ర చేరుకున్న తర్వాత, పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గన్ సెల్యూట్ సమర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి గౌరవ వందనం సమర్పించారు. కుటుంబ సభ్యులు సురవరం భౌతికకాయాన్ని గాంధీ ఆసుపత్రి వర్గాలకు అప్పగించారు. అంతకుముందు, మఖ్దూం భవన్‌లో ఉంచిన సుధాకర్ రెడ్డి పార్థివదేహానికి పలువురు ప్రముఖులు అంజలి ఘటించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్

వివరాలు 2లో..

## సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటాం



- పీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి సీఎం రేవంత్ నివాళి
- సిద్ధాంతాలకు కట్టుబడిన గొప్ప నేత సురవరం అని కొనియాడిన ముఖ్యమంత్రి
- సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ
- గద్దర్, జైపాల్ రెడ్డిల మాదిరిగానే సురవరంకు సముచిత గౌరవం ఇస్తామని వెల్లడి
- మగ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ నేతలతో సీఎం భేటీ, సేవలు స్మరణ

వివరాలు 2లో..

# బీఆర్ఎస్ మూడు ముక్కలుగా చీలింది..

## వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ క్లోజ్




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో కుటుంబ పోరు నడుస్తోందని.. ఆ పార్టీ మూ డు ముక్కలుగా చీలిపోయిందని అన్నారు. బీఆర్ఎస్ ను నాలుగు ముక్కలు చేయాలని మరో వ్యక్తి చూస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు.బీఆర్ఎస్ పని అయిపోయిందని..

వివరాలు 2లో..

# భారత్ లో పర్యటించనున్న జెలెన్ స్కీ

- కీవ్ పర్యటనలో జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించిన మోదీ
- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపర్చుకోవడమే లక్ష్యంగా టూర్
- ఈ ఏడాది చివరిలో రష్యా ప్రెసిడెంట్ పుతిన్ కూడా భారత్ కు రాక

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీ త్వరలో భారత్ లో పర్యటిం చనున్నట్లు సమాచారం. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగు పర్చుకో వడమే ఈ పర్యటన ఉద్దేశమని ఉక్రెయి న్ రాయబారి

వివరాలు 2లో..



# సినీ ఇండస్ట్రీలో సంస్కరణలు అవసరం.. ఏం కావాలో కొత్త పుస్తకం రాసుకుందాం



**హైదరాబాద్ పెన్ పవర్:** సినీ ఇండస్ట్రీలో సంస్కరణలు అవసరమని, చిత్ర పరిశ్రమకు ఏం అవసరమో కొత్త పుస్తకం రాసుకుందామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఆదివారం (ఆగస్ట్ 24) పలువురు టాలీవుడ్ నిర్మాతలు, దర్శకులు సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్?లోని ఆయన నివాసంలో కలిశారు. సినీ కార్మికుల సమ్మె పరిష్కారానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సినిమా పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలన్నారు. ఇందుకోసం త్వరలో సినీ కార్మికులను కూడా పిలిచి మాట్లాడుతానని అన్నారు. ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని,

వివరాలు 2లో..

# సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో భయం మొదలైంది

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- పదవులకు రాజీనామా చేసి ఉపఎన్నికల్లో గెలవాలని డిమాండ్
- 20 నెలల పాలనపై రేవంత్ రెడ్డి ప్రజాతీర్పు కోరాలని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వ అప్పులు, హైడ్రా ఆగడాలపై తీవ్ర విమర్శలు
- కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధిని గుర్తు చేసిన కేటీఆర్
- నాయకులు మోసం చేసినా కార్యకర్తలు పార్టీతోనే ఉన్నారని ప్రశంస



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి,

వివరాలు 2లో..

# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై న్యాయ సలహా కోసం ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఆదివారం (ఆగస్ట్ 24) భేటీ అయ్యింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై చర్చించనుంది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదుల సలహాలు, సూచనలు స్వీకరించనుంది కేబినెట్ సబ్ కమిటీ.

వివరాలు 2లో..

# ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం.. డీఆర్‌డీవో మరో ఘన విజయం

- భారత రక్షణ రంగంలో మరో కీలక మైలురాయి
- ఐఏడీడబ్ల్యూఎస్ తొలి ప్రయోగ పరీక్ష విజయవంతం
- ఒడిశా తీరంలో పరీక్షను నిర్వహించిన డీఆర్‌డీవో
- శత్రువుల నుంచి గగనతలానికి బహుళస్థాయి రక్షణ
- డీఆర్‌డీఓ బృందాన్ని అభినందించిన మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) తన అమ్ముల పొదిలో మరో శక్తిమంతమైన అ స్త్రాన్ని చేర్చింది. దేశ రక్షణ

వివరాలు 2లో..



# కాంగ్రెస్, బీజేపీ ఉచ్చులో పడకండి.. బీహారీలకు ప్రశాంత్ కిశోర్ హెచ్చరిక



- బీహార్ లో అసలు సమస్యలను ఆ రెండు పార్టీలు పట్టించుకోవట్లేదని విమర్శ
- ఓట్ చోరీ అంటూ కాంగ్రెస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయంటూ ఆగ్రహం
- వలసలు, అవినీతి, విద్యా సౌకర్యాల కొరత వంటి సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలను వదిలేసి 'ఓట్ చోరీ' పైనే పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని అన్నారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# "లోకల్" వార్

తెలంగాణ కాంగ్రెస్ కు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్ గా మారాయి. నిజానికి ఇరవై నెలల కాంగ్రెస్ పాలనకు ఈ ఎన్నికలు ఒక రెఫరెండంగా చూడాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తుంది. అయితే అవి ఏ మేరకు ప్రజల్లో సంతృప్తి నిచ్చాయన్నది ఈ ఎన్నికల్లో తేలనుంది. ఎందుకంటే గ్రామ స్థాయిలోనూ, పట్టణ, నగర స్థాయిలో జరిగే ఎన్నికలు కావడంతో పాటు పార్టీ గుర్తు ఉన్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా జరగనుండటంతో ఇది ఖచ్చితంగా కాంగ్రెస్ ఇరవై నెలల పరిపాలనకు రెఫరెండంగానే భావించాలి. ఎవరు అవునన్నా... కాదన్నా రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న ఈ ఎన్నికలు ప్రజల మూడ్ ను తెలియజేయనున్నాయి.

**రైతుల్లోనూ అసంతృప్తి..**

అందులోనూ ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జాము నుంచి క్యూ లైన్ లో నించుని యూరియా బస్తాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా యూరియా కొరత త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తుంది. మరొకవైపు పాలన విషయంలోనూ ప్రజల్లో కొంత అసంతృప్తి ఉందన్నది వాస్తవం. కాంగ్రెస్ ప్రభుత్వం కావడంతో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీవైపు చూడాల్సి వస్తుంది. అందుకే రేవంత్ రెడ్డి స్వేచ్ఛగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలను కూడా అర్హులైన వారందరికీ అందచేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని సొంత పార్టీ నేతలే బయటపెడుతున్నారు. రైతు భరోసా వంటి పథకాలు చేపట్టినా దానిపై యూరియా వచ్చి ఇబ్బందిపెట్టినట్లయింది.

**పట్టణ ప్రాంతంలో...**

ఇది ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అననుకూలమైన కాలమేనని చెప్పాలి. పల్లె ప్రాంతాల్లో ఇలా ఉంటే హైదరాబాద్ వంటి నగరాల్లో హైడ్రా కూల్చివేతలు రేవంత్ సర్కార్ పై కొంత మంది ప్రజల్లో అసంతృప్తి ఉంది. అదే సమయంలో మూసీ అభివృద్ధి పథకం కూడా హైదరాబాద్ దాని చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల ఎఫెక్ట్ ఎక్కువగా ఉండే అవకాశముంది. ఇక బీసీ రిజర్వేషన్లను చట్టపరంగా అమలు చేయకుండా పార్టీ పరంగా చేసి ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుంది. కానీ బీసీలు ఎంత మేరకు కాంగ్రెస్ కు అండగా నిలబడతారన్నది మాత్రం సందేహమే. ఇక అనేక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల మధ్య వైరుధ్యాలు, గ్రూపులు కూడా ఈ ఎన్నికల ఫలితాలపై ప్రతిబింబించే అవకాశముంది. అందుకే రేవంత్ రెడ్డికి మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలు అంత సులువు కాదన్నది వాస్తవం. మరి గెలిచి పరువు నిలబెట్టుకుంటారా? ఓడి తమ పనితీరును ఇది అని చెప్పదలచుకున్నారా? అన్నది త్వరలోనే తెలియనుంది.

# ముగిసిన సురవరం అంతిమయాత్ర...

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ, ఎమ్మెల్సీ కోదండరామ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ వంటి అనేక మంది నేతలు ఆయనకు తుది నివాళులర్పించారు. 83 ఏళ్ల సుధాకర్ రెడ్డి వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో శుక్రవారం రాత్రి గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నల్గొండ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన ఆయన, 2012 నుంచి 2019 వరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు. కార్మిక వర్గం, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నేతగా తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆయన తనదైన ముద్ర వేశారు. సుధాకర్ రెడ్డి కుటుంబం ఆయన కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసింది.

## సురవరం సుధాకర్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా కేబినెట్‌లో

# నిర్ణయం తీసుకుంటాం

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. నిరుపేదలు, బహుజనుల పక్షాన నిలిచిన గొప్ప నేతను కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్‌లో ఉంచిన సురవరం సుధాకర్ రెడ్డి పార్థివదేహాన్ని ముఖ్యమంత్రి సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సీపీఐ జాతీయ నాయకులు డి. రాజా, కె. నారాయణ, కూనంనేని సాంబశివరావు, అజీజ్ పాషాతో మాట్లాడి సురవరం గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "సుధాకర్ రెడ్డి గారు విద్యార్థి దశ నుంచి జాతీయ రాజకీయాల వరకు ఒకే సిద్ధాంతంతో, నిరాడంబరంగా జీవించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసినా ఏనాడూ అహంకారం దరిచేరనీయలేదు. పాలమూరు బిడ్డగా బూర్గుల, జైపాల్ రెడ్డిల కోవలో ఆయన జిల్లాకు ఎంతో పేరు తెచ్చారు," అని కొనియాడారు. సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టాలని గతంలో సుధాకర్ రెడ్డి కోరగానే తక్షణమే అమలు చేశామని సీఎం గుర్తుచేశారు. "విలువలతో కూడిన నాయకులను గౌరవించుకోవడంలో మా ప్రభుత్వం ముందుంటుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ, గద్దర్, జైపాల్ రెడ్డిల పేర్లను చిరస్థాయిగా నిలిపాం. అదే విధంగా సుధాకర్ రెడ్డి గారిని కూడా శాశ్వతంగా గుర్తుంచుకునేలా సముచిత నిర్ణయం తీసుకుంటాం," అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తన సంతాప సందేశాన్ని పంపినట్లు సీఎం తెలిపారు.

# భారత్ లో పర్యటించనున్న జెలెన్ స్కీ

- మొదటి పేజీ తరువాయి

ఒలెక్సాండర్ పోలిష్ చుక్ తెలిపారు. జెలెన్ స్కీ పర్యటనకు సంబంధించి తేదీలను ఖరారు చేయడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతేడాది ఆగస్టులో కీవ్ ను సందర్శించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని భారత్ కు ఆహ్వానించారు. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రధాని మోదీ ఒత్తిడి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో ఉక్రెయిన్, రష్యా మధ్య శాంతి కోసం వాదిస్తూ "ఇది యుద్ధ యుగం కాదు"
అని నొక్కి చెప్పారు. పుతిన్, జెలెన్ స్కీలతో టెలిఫోన్ సంభాషణలు జరిపారు. భారతదేశం రెండు దేశాల మధ్య శాంతిని కోరుకుంటుందని వెల్లడించారు. మరోవైపు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ ఏడాది చివరలో భారత్ కు రానున్నారు.

# బీఆర్ఎస్ మూడు ముక్కలుగా చీలింది..

- మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీ రాష్ట్రంలో ఎక్కడ లేదన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఉండదన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉన్నది ఆ మతపిచ్చి పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. ఎవడు తప్పు చేసినా ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆదివారం ( ఆగస్టు 24 ) కరీంనగర్? జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గంలో రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ పాదయాత్రలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్?లో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. మన భవిష్యత్ కోసమే ఈ జనహిత పాదయాత్ర అని.. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికే ఈ పాదయాత్ర చేపట్టామని తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై

# కేబినెట్ సబ్ కమిటీ భేటీ

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం విధించిన గడువు ప్రకారం.. ఆగస్ట్ 28వ తేదీ లోపు కేబినెట్ సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంది. ఆగస్ట్ 29న కేబినెట్ సమావేశం నిర్వహించి సబ్ కమిటీ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై మంత్రి మండలి నిర్ణయం తీసుకోనుంది.
శనివారం (ఆగస్ట్ 23) గాంధీభవన్?లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో బీసీ రిజర్వేషన్ల పెంపుపై న్యాయ సలహా కోసం మంత్రులతో కమిటీని నియమించాలని పీఏసీ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్?తో చర్చించి కమిటీని పీసీసీ చీఫ్?మహేశ్ గౌడ్ ప్రకటించారు. మంత్రుల కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క ఉన్నారు. దేశంలోని నిష్ణాతులైన న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులతో సంప్రదింపులు జరిపి.. ఈ నెల 28లోగా నివేదిక ఇవ్వాలని కమిటీకి గడువు విధించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లు, పంచాయతీ రాజ్?చట్ట సవరణ ఆర్డినెన్స్?కేంద్రం వద్ద పెండింగ్?లో ఉండడంతో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలో కమిటీ సంప్రదింపులు జరిపి ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనుంది. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

## ఆకాశంలో భారత్‌కు అభేద్య కవచం..

# డీఆర్‌డీవో మరో ఘన విజయం

- మొదటి పేజీ తరువాయి

సామర్థ్యాలను కొత్త శిఖరాలకు చేర్చే క్రమంలో శనివారం ఒడిశా తీరం లో ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) తొలి ప్రయోగ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించారు. ఈ చారిత్రాత్మక విజయంపై డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, భారత సాయుధ దళాలను, పారిశ్రామిక వర్గాలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. "ఐఏడీడబ్ల్యూఎస్ విజయవంతమైన అభివృద్ధికి కృషి చేసిన డీఆర్‌డీవో, సాయుధ దళాలు, పరిశ్రమలకు నా అభినందనలు. ఈ ప్రత్యేకమైన ప్రయోగ పరీక్ష మన దేశ బహుళస్థాయి గగనతల రక్షణ సామర్థ్యాన్ని రుజువు చేసింది. శత్రువుల వైమానిక దాడుల నుంచి దేశంలోని కీలక ప్రాంతాలకు, ముఖ్యమైన సంస్థలకు ఇది మరింత పటిష్ఠమైన రక్షణ కల్పిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.
ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్ (ఐఏడీడబ్ల్యూఎస్) అనేది ఒకే వ్యవస్థ కాదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బహుళస్థాయి రక్షణ వ్యవస్థ. ఇందులో క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (క్యూఆర్‌శామ్), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీషోరాడ్స్) క్షిపణులతో పాటు అధిక శక్తివంతమైన లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) కూడా ఉన్నాయి. ఈ వ్యవస్థలన్నీ కలిసి భారత గగనతలానికి ఒక అభేద్యమైన రక్షణ కవచంగా పనిచేస్తాయని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కాంగ్రెస్, బీజేపీ ఉచ్చులో పడకండి.. బీహారీలకు ప్రశాంత్ కిశోర్ హెచ్చరిక

- మొదటి పేజీ తరువాయి

ఆర్జేడీ పార్టీ సూచనల ప్రకారమే రాహుల్ గాంధీ నడుచుకుంటున్నాడు తప్ప బీహారీల సమస్యలపై ఆయన దృష్టి పెట్టడంలేదని మండిపడ్డారు.దఎన్నికల వేళ రాహుల్ గాంధీని నరేంద్ర మోదీ, నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ పరస్పరం విమర్శించుకుంటున్నారని చెప్పారు. ఆ పార్టీల ఉచ్చులో పడొద్దంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. బీహార్ లో అసలైన సమస్యలు పేదరికం, నిరుద్యోగం, వలసలు, సరైన విద్యా సౌకర్యాలు లేకపోవడం.. వంటి వాటిని ప్రధాన పార్టీలు గాలికి వదిలేశాయని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు,
ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజల కోసం 'జన్ సూరజ్ పార్టీ' ఆవిర్భవించిందని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.

## సినీ ఇండస్ట్రీలో సంస్కరణలు అవసరం..

## ఏం కావాలో కొత్త పుస్తకం రాసుకుందాం

- మొదటి పేజీ తరువాయి

పరిశ్రమలోకి కొత్తగా వచ్చేవారికి నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నైపుణ్యాల పెంపు కోసం ఒక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న స్కిల్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని.. ఇలాంటి సమయంలో ఇండస్ట్రీలో వివాదం వద్దనే కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించానని పేర్కొన్నారు. నిర్మాతలు, కార్మికుల అంశంలో సంస్కరణలు అవసరమని అన్నారు. కార్మికుల విషయంలో నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలని కోరారు. నిర్మాతలు, కార్మికులు, ప్రభుత్వం కలిసి ఒక పాలసీ తెస్తే బాగుంటుందని, సినీ పరిశ్రమకు మానిటరింగ్ అవసరమని పేర్కొన్నారు. సినీ ఇండస్ట్రీలో వ్యవస్థలను నియంత్రిస్తామంటే ప్రభుత్వం సహించదని అందరూ చట్ట పరిధిలో పని చేయాల్సిందేనని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. మూవీ ఇండస్ట్రీ విషయంలో తాను న్యూట్రల్?గా ఉంటానని స్పష్టం చేశారు. హైదరాబాద్?లో అంతర్జాతీయ సినీ చిత్రీకరణ కూడా జరుగుతోందని.. అలాగే తెలుగు సినిమా షూటింగులు కూడా ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చూడాలని నిర్మాతలకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినీ పరిశ్రమను ఉంచడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## సుప్రీంకోర్టు తీర్పుతో వారిలో

# భయం మొదలైంది

- మొదటి పేజీ తరువాయి

ఉప ఎన్నికలను ఎదుర్కొని గెలవాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 20 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకొని ఉప ఎన్నికలకు రావాలని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో ఓటమి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. అందుకే వారు రాజీనామా చేసేందుకు వెనుకాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల బ్లాక్‌మెయిల్ దందాల కోసమే 'హైడ్రా' వ్యవస్థ పనిచేస్తోందని, దాని ఆగడాల వల్ల ఒకప్పుడు దేశానికే తలమానికంగా ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు కంటే, రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల కాలంలోనే ఎక్కువ అప్పులు చేశారని విమర్శించారు. అభివృద్ధి గురించి మాట్లాడే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని కేటీఆర్ నిలదీశారు. గతంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. 2014లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నప్పటికీ, కేసీఆర్ నాయకత్వంలో ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. దీంతో నగరంలో ఇన్వర్టర్లు, జనరేటర్ల అవసరమే లేకుండా పోయిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయకుండా హైదరాబాద్‌ను అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండేలా అభివృద్ధి చేశామని చెప్పారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ పండుగలకు సమ ప్రాధాన్యత ఇస్తూ మతసామరస్యాన్ని కాపాడామని అన్నారు. అందుకే 2023 ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా గులాబీ జెండాకే పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేతో సహా పార్టీ మారిన వారంతా ప్రజల కోసం కాదని, కేవలం తమ స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక లాభాల కోసమే కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే, ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి చూపించాలని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం టైంపాస్ మాటలు చెబుతూ, కేసీఆర్‌పైన, తనపైన కేసులు పెడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. నాయకులు పార్టీని మోసం చేసి వెళ్లినా, బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని కేటీఆర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ మరోసారి డౌన్...

# కస్టమర్లకు తప్పని తిప్పలు!

దేశంలోని ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ వినియోగదారులకు మరోసారి కష్టాలు తప్పలేదు. ఆదివారం దేశవ్యాప్తంగా వేలాది మంది కస్టమర్లు నెట్‌వర్క్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి కాల్స్ చేసుకోలేక, మొబైల్ ఇంటర్నెట్ వాడలేక తీవ్ర అసహనానికి గురయ్యారు. వారంలోపే ఎయిర్‌టెల్ సేవలు ఇలా స్తంభించడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఆదివారం ఉదయం నుంచే సిగ్నల్ బలహీనంగా ఉండటం, కాల్ డ్రాప్స్, నెట్‌వర్క్ పూర్తిగా నిలిచిపోవడం వంటి సమస్యలు మొదలయ్యాయి. ఔటేజ్ ట్రాకింగ్ వెబ్‌సైట్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, మధ్యాహ్నం నాటికి ఈ సమస్య తారాస్థాయికి చేరింది. ఒకే సమయంలో 7,000 మందికి పైగా యూజర్లు తమకు సేవలు అందడం లేదని ఫిర్యాదు చేశారు. వీరిలో సగానికి పైగా వినియోగదారులు కాలింగ్ సమస్యలు ఎదుర్కోగా, దాదాపు మూడో వంతు మంది ఇంటర్నెట్ యాక్సెస్ చేయలేకపోయారు. మిగిలిన వారు పూర్తి నెట్‌వర్క్ వైఫల్యాన్ని ఎదుర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా సహా అనేక ప్రధాన నగరాల్లో ఈ అంతరాయం కనిపించింది. సేవలు నిలిచిపోవడంతో విసుగెత్తిన కస్టమర్లు సోషల్ మీడియా వేదికగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "బ్రాడ్‌బ్యాండ్ పనిచేస్తున్నా, మొబైల్ నెట్‌వర్క్ పూర్తిగా కుప్పకూలింది" అని కొందరు యూజర్లు ఎక్స్ లో పోస్టులు పెట్టారు. "మేము బిల్లులు ఆలస్యంగా కడితే వెంటనే జరిమానా విధిస్తారు, కానీ కంపెనీలు సేవలు నిలిపివేస్తే మాత్రం ఎలాంటి జవాబుదారీతనం ఉండదా?" అని మరికొందరు ప్రశ్నించారు. "నేను 198కి కాల్ చేశాను. నెట్‌వర్క్‌లో తీవ్రమైన సమస్య ఉందని, ప్రతి కస్టమర్ దీనిని ఎదుర్కొంటున్నారని ఎయిర్‌టెల్ ధృవీకరించింది" అని చందర్ భాటియా అనే యూజర్ తెలిపారు.

# దేవాదాయశాఖ చెర నుండి బాలవినాయకుని విడుదల



**నర్సీపట్నం, పెన్ పవర్, ఆగస్టు 24:** నర్సీపట్నం ఐదు రోడ్ల జంక్షన్‌లోని బాల వినాయక ఆలయం ఇకపై దేవాదాయ శాఖ పరిధిలో ఉండదు. ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధి నుండి రద్దు చేసి బాల వినాయక యువజన సంఘానికి బాధ్యతలు అప్పగించినట్లు ఆలయ ఈవో సాంబశివరావు ప్రకటించారు. 2022లో గత ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను విస్మరిస్తూ, భక్తుల మనోభావాలకు విరుద్ధంగా ఆలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకుంది. కానీ ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచన మేరకు ఐదు లక్షల లోపు ఆదాయం కలిగిన ఆలయాలను దేవాదాయ శాఖ పరిధి నుండి మినహాయించాలని నిర్ణయం తీసుకోవడంతో నర్సీపట్నం బాలవినాయక ఆలయం తిరిగి సంఘం ఆధీనంలోకి వచ్చింది.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు నూతన ఆలయ కమిటీని కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ప్రకటించారు. రాజేష్ సమక్షంలో నూతన కమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులకు రాజేష్ కండువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీలో ఛైర్మన్ గా ధనిమిరెడ్డి తాతాజీ (బుజ్జి), కార్యదర్శిగా రుత్తల గోవిందు,

బొత్స నూకరాజు, ఫణి, లెక్కల చిన్నశివ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మాట్లాడుతూ కొత్త కమిటీ రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి చేర్చి అన్నప్రసాదాలు, పండుగలు సాదాసీదాగా జరిపేలా చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే మొదటి తీర్థాన్ని అంగరంగవైభవంగా నిర్వహించామని, ఇకముందు ప్రతి కార్యక్రమాన్ని ఘనంగా చేస్తామని తెలిపారు. ఆలయ చైర్మన్ ధనమిరెడ్డి తాతాజీ మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, చింతకాయల విజయ్ బాబు, చింతకాయల రాజేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రుత్తల కృష్ణ, వార్డు ఇన్‌ఛార్జిలు నాగేంద్ర రాజు, పైల గోవిందు, లాలం మురళీకృష్ణ, కృష్ణ రామణాపల్లి ఆవ చైర్మన్ రాజేశ్వరరావు, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అగనంపూడి రామాలయం నిర్మాణానికి విరాళం



**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 24:** మహావిశాఖ నగర పాలక సంస్థ 85వ వార్డు, పెదమడక, అగనంపూడి రామాలయం నిర్మాణం కొరకు

నారాయణ కుమారుడు అమర్ పిన్ని అప్పారావు అక్షరాల 56,565/- విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విందుల నారాయణ రావు, విందుల సతీష్,కరణం సన్నీ, అమరపిన్ని గోవింద,మాడుగుల అప్పలరాజు,నరసింహనాయుడు,రమేష్,శంకర్,బుజ్జి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శారాస్ జెమిని వాయిస్ మాస పత్రిక ప్రారంభం




**గాజువాక : పెన్ పవర్, ఆగస్టు 24**


ఎస్. బి. టి హెూటల్ లో శారాస్ జెమిని వాయిస్ మాసపత్రికను ఎడిటర్ శారా జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్


శంకబ్రత బాగ్చీ , ఆయన సతీమణి సువ శ్రీ బాగ్చీ, పల్లా కార్తీక్ చేతులు ఘనంగా ప్రారంభించడం ఆనందంగా ఉందని పత్రిక యాజమాన్యం ఆనందం వ్యక్తం చేశారు. తమ పత్రిక ద్వారా నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొని రావడమే కాకుండా వాటి పరిష్కారానికి అధికారుల ద్వారా తన చర్యలు తీసుకునే విధంగా తమ యొక్క కార్యచరణ ఉంటుందన్నారు.

కార్యక్రమం లో ఏపి ఎం ఎఫ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ లత, టీం సభ్యులు అనుపమయాదవ్,నిషబేగం,ప్రసాద్,కోటి, జాన్ వరబాబు, పలువురు జర్నలిస్ట్ లు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంత భారీ వినాయకుడుని పెడితే అంత భక్త ఉన్నట్టా ?








- స్వామికార్యం స్వకార్యం కోసం భక్తి ముసుగుతో భారీ దండదా నిర్వహిస్తున్న
- ఉత్సవ కమిటీ
- భారీ వినాయకుడి మండపం వద్ద తమ హవాతో భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైనం
- అన్యాయాలకు అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం, పోలీసులు నిమ్మలంగా ఉండడం కోసమెరుపు
- ఈ ఉత్సవ కమిటీలకు పలు రాజకీయ పార్టీలు అండదండలు ఉండడంతో చర్యలకు అధికార యంత్రాంగం వెనుకంజ
- భక్తి ముసుగులో భారీ వ్యాపారానికి తెరతీస్తున్న వైనం





**గాజువాక : పెన్ పవర్, ఆగస్టు 24**:పారిశ్రామిక ప్రాంతం లో వినాయక చవితి మహెూత్సవాలను పురస్కరించుకొని భారీ దందాకు తరలిస్తున్న ముఠాలపై ప్రత్యేక కథనం ఆది దేవుడు వినాయకుడు దర్శనానికి ప్రత్యేక రుసుము, వాహనాలకు పార్కింగ్ ఫీజ్, స్టాల్స్ పేరుతో భారీగా వ్యాపార దందాల నిర్వహిస్తూ ఇబ్బడిముబ్బడిగా రెండు చేతుల సంపాదిస్తున్న ఉత్సవ కమిటీ కార్యవర్గం వర్గం .

పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నప్పటికీ పేట్రేగిపోతున్న ఒక వర్గం

పార్కింగ్ ఫీజు స్టాల్స్ నిర్వహణకు చవితి మహెూత్సవం నాడు వరకు విరివిగా అద్దెల రూపంలో వ్యాపారస్తులు నుండి కలెక్ట్ చేస్తూ రెండు చేతుల అర్జిస్తూ అందిన కాడకు దండుకుంటున్నారు ,వీటికి ఎటువంటి రసీదులు గాని చలానాల గాని వగైరాలు ఉండవనేవి జగమెరిగిన సత్యం భక్తి ముసుగులో జరుగుతున్న ఇటువంటి వ్యాపారాలకు సోషల్ ఆడిటింగ్ నిర్వహించాలని ప్రభుత్వం దీనిపై ఉక్కుపాదం మోపాలని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు .

ప్రతి సంవత్సరం పండగ సమయాల్లో ఇటువంటి కార్యక్రమాలు చేయడానికి ఒక వర్గం అంటూ ఏర్పడుతూ తమ కార్యకలాపాలను యదేచ్ఛగా నిర్వహిస్తూ రెండు చేతుల అర్జిస్తూ ప్రశ్నించిన వారిపై ఎదురుదాడిగా దిగుతున్నా వైనం మనకు గతంలో అనేకం సంఘటనలే చూసాము.

ఆది దేవుడి పేరుతో అరాచకాలు పెచ్చు మీరు పోతున్నాయి .పోలీసులు నిబంధనల పేరుతో అనేక ఆంక్షలు విధించినప్పటికీ వాటిని ఎవ్వరూ పట్టించుకోవటం లేదు ప్రధానంగా పాత గాజువాక లంక మైదానంలో ఏర్పాటు చేస్తున్న భారీ గణనాయకుని వద్ద నిర్వాహకులు గణనీయమైన వ్యాపారం చేస్తూ ప్రజల జేబులు లూటీ చేస్తున్నారు భారీ ఎత్తున చందాలు వసూలు చేయడంతో పాటు ఆ మైదానంలో షాపులు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున వసూలు చేస్తూ దర్జాగా జేబులు నింపుకుంటున్నారు ఆ నిర్వాహకులకు కొంతమంది రాజకీయ నాయకులు అండగా నిలబడటంతో పోలీసులు కూడా పట్టించుకోవడం మానేశారు. నిబంధనలు ఉల్లంఘించి కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు కూడా చూస్తున్నారే తప్ప కనీసం చర్యలు తీసుకోవడానికి ముందుకు వెలేకపోతున్నారు ఇప్పటికే లక్షలాది రూపాయలు చందాల పేరుతో వసూలు చేయడంతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన వాణిజ్యసముదాలకు నుండి దండిగాని అద్దెలు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా భారీగా అడ్వాన్స్ కూడా తీసుకుని వ్యాపారం చేసుకోవడానికి నిర్వహకులుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు అంటే ఆదిదేవుడు ఎలా వ్యాపారంగా మారిపోయాడో దానివల్ల ఎవరెవరు బాగుపడుతున్నారో వారికి రాజకీయ నాయకులు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాల్సిందే నని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారుల జోక్యం చేసుకోకపోతే అక్కడ అసాంఘిక,అసభ్య కార్యక్రమాలు కూడా జరిగే అవకాశం లేకపోలేదని కొందరు భక్తులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార వర్గాలు ఎటువంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది

# గణేష్ ఉత్సవాలు నిర్వహణకు పోలీసులు సూచించిన మార్గదర్శకాలు





**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 24:** సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ లో ఉన్న గణేష్ మండపాలు, ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి పత్రిక ముఖంగా ఏసీపి సౌత్ సబ్ డివిజన్ వై. శ్రీనివాసరావు, సీఐ స్టీల్ ప్లాంట్ కేశవ, సీఐ దువ్వాడ మల్లేశ్వరరావు, సీఐ గాజువాక పార్థసారథి , పోలీస్ సిబ్బంది తో సమావేశంలో పాల్గొని తెలియజేశారుజి

**గణేశ్ మండపాల భద్రతా చర్యలు- మార్గదర్శకాలు.**

వినాయక చవితి పండగ మహెూత్సవం నిర్వహించే నిర్వాహకులు చవితి మండపాలలో విద్యుత్ పనులు ప్రారంభించే ముందు మండపాల లోపల మరియు బయట పవర్ లైన్ పరిసరాలను శ్రద్ధగా పరిశీలించాలి. విద్యుత్ తీగలు మండపాలకు తాకకుండా చూడాలని అన్నారు.

మండపాలలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను ఎవరూ అనవసరంగా తాకరాదని. షార్ట్ సర్క్యూట్ నివారణ కోసం అధిక వేడి ఉత్పత్తి చేసే బల్బులు, కవర్ లేని హాలోజన్ లాంపులు వాడకూడదని,

చిన్న పిల్లలను విద్యుత్ తీగల సమీపానికి అనుమతించరాదన్నారు

విద్యుత్ తీగలు తెగినపుడు లేదా మరమ్మత్తుల అవసరమున్నపుడు, ఏపీ ఈపీ డీసీ ఎల్ సిబ్బందిని సంప్రదించాలి.

కేవలం 3-పిన్ ప్లగ్‌లు మరియు ఎమ్ సి బి సాకెట్లు మాత్రమే వాడాలని ,ఓవర్‌లోడ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు,

6.విద్యుత్ పనులు సర్టిఫైడ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్లచే మాత్రమే నిర్వహించాలని,

ఊరేగింపులు, నిమజ్జన స్థలాల్లో సరైన బారికేడింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు, కుక్కలు, పందులు వంటి జంతువులు మండపాల దగ్గరికి రాకుండా నివారించాలని ,మండప వేదిక వద్ద మట్టి దిగబడకుండా కప్పాలన్నారు.

**విగ్రహాల నిమజ్జనం అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే జరగాలి.**

మండపాల్లో పేలుడు పదార్థాలు ఉంచకూడదు. నూనె దీపాలు వెలిగించేటప్పుడు అత్యంత జాగ్రత్త పాటించాలన్నారు .

మండపాన్ని ప్రతి రోజు మూసివేసే ముందు, వెలిగించే ముందు దీపాలు పూర్తిగా ఆర్పివేయాలన్నారు .

మండపాల సమీపంలో అగ్నికి గురి చేసే పదార్థాలు ఉంచరాదు. నీరు మరియు ఇసుక తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో 101 ఫైర్ స్టేషన్‌కు కాల్ చేయాన్నారు.

.నిమజ్జన ఊరేగింపుల్లో పటాసులు వాడకూడదన్నారు.

లౌడ్‌స్పీకర్లు, మైకుల వినియోగంపై పరిమితులు ఉండాలి. పిసిబి నిర్ణయించిన డెసిబెల్ పరిమితిని అతిక్రమించకూడదు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మైకులు నిషేధించబడ్డాయి.

ఊరేగింపు మార్గాల్లో ప్రజలు రంగులు వేయకూడదు.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించి పిఓపి విగ్రహాల వాడకాన్ని నిరోధించేందుకు పాఠశాలలు, కళాశాలల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

.నిమజ్జన ప్రాంతాల్లో తగినంత ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని,

మండపాల్లో కనీసం 3 వాలంటీర్లు 24/7 అందుబాటులో ఉండాలి. వారి కాంటాక్ట్ నంబర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఇవ్వాలని,మండపాల కార్యకలాపాలు ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా చూడాలి. సరైన క్యూలైన్లు, మల్టిపుల్ గ్యాంగ్వేస్ ఏర్పాటు చేయాలని,

అనుమానాస్పద వస్తువులు , సామాగ్రి

కనబడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. భక్తులు తెచ్చే పెద్ద బ్యాగులు, సూట్‌కేసులు, పార్సెల్స్ అనుమతించరని,

మండపం రోడ్డులో ఒక వైపు మాత్రమే ఉండాలి. ట్రాఫిక్‌కు అడ్డంకి కాకూడదు.

మండపాల వద్ద వాహనాలు పార్క్ చేయకూడదు. అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని,చెడు ఉద్దేశాలున్న వ్యక్తులు మండపాల వద్ద సమస్యలు సృష్టించే అవకాశముంది. వారు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని,

డీజే సిస్టమ్‌లు మండపాల్లో మరియు ఊరేగింపుల్లో అనుమతించబోమని,

మండపాల్లో జూదం, మత్తు పదార్థాల వినియోగం పూర్తిగా నిషిద్ధం. కమిటీ సభ్యులు దీనిపై బాధ్యత వహించాలని,మండపాల్లో సీసీటీవీలు ఏర్పాటు చేసి, 24/7 ఫుటేజ్ రికార్డ్ చేసి మానిటర్ చేయాలి.

సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా వచ్చే పుకార్లను నమ్మకూడదు, ఫార్వర్డ్ చేయకూడదు. పుకార్లు వచ్చినచోట వెంటనే పోలీసులకు తెలియజేయాలని లేదా 100 / 112 కు కాల్ చేయాలని,

బలవంతంగా డొనేషన్లు వసూలు చేయకూడదు. లక్కీ డిప్స్, లాటరీలు నిర్వహించకూడదు.

30.మీ విగ్రహం పెద్దది అయి ఉండొచ్చు అలాగే విగ్రహం కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసి ఉండవచ్చు అలా అని దేవుడు దర్శనానికి టికెట్ ఏర్పాటు చేయరాదని ,దేవుడి పేరుతో వ్యాపారం చేయకూడదని, వెహికల్ పార్కింగ్ కోసం డబ్బులు కలెక్ట్ చేయరాదు. చీరలు అమ్ముతాం డబ్బులు కట్టండి వంటి వసూళ్లు చేయరాదని ,రోడ్డు బ్లాక్ చేసి విగ్రహం ప్రతిష్టించి ప్రజలకుఇబ్బంది కలిగించడం చేయకండని

**మద్యం తాగి అల్లర్లు చేయవద్దని,**

డ్రోన్స్ తో నిఘా ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటాం.

ఎవరైనా త్రాగి, గంజాయి , డ్రగ్స్ సేవించి అల్లరి చేసినట్లు గుర్తిస్తే పోలీసులకు తెలియజేయాలని ,విగ్రహం ప్రతిష్ట దగ్గర నుండి నిమజ్జనం వరకు 24 గంటలు ఏడు రోజులుముగ్గురు కానీ నలుగురు వాలంటీర్లు మండపాలకు గార్డింగ్ ఉండాలని, పోలీస్ స్టేషన్లకు సదరు వ్యక్తుల వివరాలు తెలియ పరచాలని,పందిరి చుట్టూ ఫైర్ ఫైటింగ్ సిస్టం, సీసీ కెమెరా , లైటింగ్స్ ఏర్పాటు చేయాలని,. అలాగే పార్కింగ్ ప్రాంతాలను భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని,క్రౌడ్ మేనేజ్మెంట్ కొరకు వాలంటీర్లను ఏర్పాటు చేసి భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కువ క్రౌడ్ ఉన్నచోట దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుంది కాబట్టి పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ఏర్పాటు చేసి తరచుగా ఎనోన్స్ చేస్తూ, దొంగలున్నారు జాగ్రత్త అనే బ్యానర్స్ ఏర్పాటుచేసి దొంగతనాలు జరగకుండా చూడాలని , పోలీసు వారు కూడా పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా అవగాహన కల్పిస్తారు అని తెలియజేసారు.

# ప్రజలకు మోసం చేసింది జగన్మోహన్ రెడ్డి కాదా...!

## హామీల పేరుతో ప్రజలను మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమే - టిడిపి నేతల ధ్వజం



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 24:** ప్రజలకు మాయ మాటలు చెప్పి జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని,జగన్ పేరడీకి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు గారడీ చేస్తూ ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండల టిడిపి అధ్యక్షుడు కాకూరు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ - నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు శనివారం మండలానికి విచ్చేసి 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' పేరుతో కార్యక్రమం చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పాడేరు నియోజకవర్గ ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపిస్తే ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళ్లకుండా గిరిజన సమస్యలు పక్కన పెట్టేసి ప్రజలను మోసం చెయ్యడం నిజం కాదా?,వైసీపీ ప్రభుత్వంలో జీవో నెంబర్ 3 తీసేసి మోసం చెయ్యడం నిజం కాదా? ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండరు అని చెప్పి ఒక్కసారైన డిస్సీ తీసారా?ప్రత్యేక డిస్సీ అని చెప్పి గిరిజన నిరుద్యోగులను మోసం చెయ్యడం నిజం కాదా? పెన్షన్లు రూ. వెయ్యి పెంచుతామని చెప్పి, రూ. 250 చొప్పున ఐదు సంవత్సరాలు పాటు పెంచడం మోసం కాదా? కుటుంబంలో ప్రతి పిల్లవాడికి అమ్మ ఒడి ఇస్తానని చెప్పి ఒక్కరికే పరిమితం చేయడం మోసం కాదా? ప్రత్యేక హోదా తెస్తానని చెప్పింది మోసం కదా? మూడు రాజధానులు మోసం కాదా? అని ప్రశ్నించారు. సొంత పార్టీ నాయకులకి, కార్యకర్తలకి ఎమ్మెల్యే అంటేనే గ్యారంటీ లేదని,అందుకే ఎమ్మెల్యే పెట్టిన ప్రోగ్రానికి రాలేదని, అది ఎమ్మెల్యే తెలుసుకోవాలని హితవు పలికారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పెట్టి సూపర్ హిట్ కొట్టారని, రాష్ట్రాన్ని సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోందన్నారు. సూపర్ హిట్ తట్టుకోలేక ఎమ్మెల్యే మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు.ఇప్పటికైనా బురదజల్లుడు ఆపి, గిరిజన సమస్యలు మీద దమ్ముంటే అసెంబ్లీ లోకి వెళ్లి మాట్లాడితే బాగుంటుందని టిడిపి నేతలు హితవు పలికారు. కార్యక్రమంలో ఇంకా ,మాజీ ఏఎంసి చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు, మాజీ జడ్పీటీసీ గాడి శ్రీరామ్మూర్తి,లోత భీమరాజు, కొర్రు రామమూర్తి, కురుజు శ్రీనుబాబు, కిముదు శ్రీరాములు, రమాదేవి, సాంబశివరావు, పాంగి రాజుబాబు, పొటుకూరి సన్యాసిరావు,ఉల్లి వెంకటేశ్వర్లు, మాతే గణేష్,సాలేబు సన్యాసిరావు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు చెండా ఏలీయా స్ఫూర్తిదాయకం:టీడీపీ డివిజన్ నాయకుడు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి



**పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 24:** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం తడిగిరి గ్రామనికి చెందిన గిరిజన ఉద్యమ నేత చెండా ఏలీయా విశాఖ కేజీహెచ్ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు విషయం తెలుసుకున్న టీడీపి డివిజన్ నాయకుడు దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి తడిగిరి చేరుకొని చెండా ఏలీయా పార్దివా దేహాన్ని పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన అనంతరం టీడీపీ డివిజన్ నాయకుడు దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరుద్యోగుల కోసం ప్రత్యేకంగా నిరుద్యోగులు సంఘం పెట్టి గిరిజన నిరుద్యోగుల కోసం ఉద్యమ పోరాటం చేసి అనేక మంది గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగలు రావడానికి అనేక కృషి చేశారని ఆయన గిరిజన ప్రాంతం ఉద్యమకారులకు ఎంతో స్ఫూర్తిదయాకమని గిరిజన ప్రాంతంలో ఓ పి జి ఆర్ సంఘం ఏర్పాటు చేసి గిరిజన ప్రాంత సమస్యలను పరిష్కరించేలా ఉద్యమ పోరాటం చేసారు అయన లేని లోటు గిరిజన ప్రాంతంలో తీర్చలేనిదని దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు ఈ కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ సుగుణధం, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## లీలా సుందరయ్య నగర్ లో చవితి రాట మహోత్సవం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 23:**జివియంసి 12వ వార్డు లీలా సుందరయ్య నగర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రుల్లో భాగంగా శ్రీ వరసిద్ధి వినాయక ఎల్లో బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం పందిరిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ముందుగా విఘ్నేశ్వర పూజ అనంతరం పందిరి రాట మహోత్సవ కార్యక్రమం గ్రామ అధ్యక్షుడు విశాఖ పార్లమెంట్ కమిటీ జిల్లా కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు.శ్రీమహాలక్ష్మి (పుష్ప) దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నవరాత్రుల చవితి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు ఎనిమిది నిర్వాహకులకులతో కంకణ కార్యక్రమం పురోహితులు నిర్వహించారు.గత 22 సంవత్సరాలుగా గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలు, అనంతరం నిర్మించే అన్నసమారాధన కార్యక్రమాలకు గ్రామ ప్రజలు సభ్యుల సహాయ సహకారాలతో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అని గ్రామ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు తెలియజేసారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీసం నాగు,కంబె అప్పలరాజు, టి పాపారావు. కర్రి సూర్యనారాయణ రెడ్డి,వి కొండలరావు గురజాపు మోహన్,వాసు,అనంత్, సాయి,వివేక్,తరుణ్,కార్తీక్, భార్గవ్,గౌతమ్,రమణమ్మ, మణి,చిన్న లక్ష్మి,పూజ,రోజా. మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వైసీపీ పెదవలస గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కంకిపాటి శ్రీరాములు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 24:**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెదవలస గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా కంకిపాటి శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం గూడెం కొత్త వీధిలోని మండల నాయకుల సమక్షంలో జరిగింది.జిల్లా వైసీపీ అధ్యక్షులు, నియోజవర్గ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనల మేరకు ఈ ఎన్నిక జరగగా, కంకిపాటి శ్రీరాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వైఎస్ఆర్ పార్టీ ఆవిర్భావం నుండే పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాను. పార్టీ నన్ను గుర్తించి ఈ బాధ్యత ఇచ్చినందుకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజుకి, మండల కమిటీ, పంచాయతీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని తెలిపారు."మీరు నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమంలో సక్రియంగా పాల్గొని, కార్యకర్తలను ఏకం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తాను" అని కంకిపాటి శ్రీరాములు గారు పేర్కొన్నారు.

## ఎల్లవరం- కట్టు వీధి రహదారి పనులు వేగవంతం చేయాలి

**జనసేన పంచాయతీ అధ్యక్షుడు మధు కుమార్**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 24:**ఎల్లవరం నుంచి కట్టు వీధి గ్రామం వరకు జరుగుతున్న రహదారి కల్వర్టు నిర్మాణ పనులను వంచుల జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు కూడ మధు కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో రహదారి అధ్వానంగా మారుతుందని, దీంతో గ్రామాల ప్రజలు తీవ్ర ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత గుత్తేదారుడిని సంప్రదించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరినట్టు ఆయన తెలిపారు."గ్రామ ప్రజలకు సదుపాయాలు కల్పించడంలో జాప్యం జరగకూడదు. కాల్వలు, డ్రైనేజీలు సమర్థవంతంగా ఉండేలా రహదారి నిర్మాణం జరుగాలి," అని కూడ మధు కుమార్ హితవు పలికారు.ఈ సందర్శన కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు పాంగి చిట్టిబాబు, రహదారి సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్ర ఒడిశా నాటు సారాయి కేంద్రాల పై ఎక్సైజ్ దాడులు.





**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 24 పెన్ పవర్.**ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు లో నాటు సారాయి తయారీ కేంద్రాలపై, పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సేంజ్ సూపర్డెంట్,బి శ్రీనాథుడు ఆదేశాల మేరకు ఏ,సంతోష్ ఏ,ఈ,ఎస్.ఆధ్వర్యంలో ఒడిస్సా ఎక్సైజ్ పోలీసులు కలసి ఆదివారం నాడు సంయుక్త దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏ,సంతోష్ మాట్లాడుతూ.నవోదయం 2.0 కార్యక్రమం అమలు లో భాగంగా ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు నాటు సారాయి తయారీ స్థావరాల అయిన వలవ,కేరడ,వనజ,బోర్ వలవ గ్రామాలలో ఒడిస్సా ఎక్సైజ్ శాఖ తో కలిసి సంయుక్త దాడులు నిర్వహించగా నాటు సారాయి తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 7,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊట మరియు రవాణా కు సిద్ధంగా ఉంచిన 150 లీటర్ల నాటు సారాయి నీ ధ్వంసంచేశామని తెలిపారు.ఒడిస్సా సరిహద్దు నుండి నాటుసారా రవాణా చేస్తున్న వారి పేర్లు,పూర్తి సమాచారం తమ వద్ద ఉందని తదుపరి దర్యాప్తు నిర్వహించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.నాటు సారా పై నిరంతర నిఘా పెడుతున్నామని,ఈ క్రమంలో ప్రజలు నాటు సారాయి తయారీ,రవాణా,అమ్మకాలు చేసే వారిపై ఫిర్యాదులు చేసేందుకు(6302936599) ఫోన్ నంబర్ కు ఫోన్ చేయాలని, నాటు సారా నియంత్రణ లో ప్రజలు,ప్రజాప్రతిధులు సహకరించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో ప్రొహిబిషన్ %ౖ% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్,కురుపాం,పి,శ్రీనివాసరావు.ఆంధ్ర ఒరిస్సా.పోలీస్ లు పాల్గొన్నారు.

## 76 వార్డు అభివృద్ధి దిశగా ముందుకు

-సామాజిక భవనం ప్రారంభం.





**గాజువాక: పెన్ పవర్, ఆగస్టు 24** జీవీఎంసీ 76 వార్డు భారత్ నగర్ లో సుమారు రూ. 15లక్షల తో సామాజిక భవనం నిర్మించారు. ఆదివారం వార్డు కార్పొరేటర్ జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు లో ఉన్న గ్రామాలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తున్నామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహాయ సహకారాలతో వార్డు ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్తున్నామని తెలిపారు. అన్ని గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీరు ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో కూన వెంకట్రావు, రెడ్డి, జీలకర్ర , రమణ, రమణ, సురేష్ , పీత నాగరాజు, శంకర్, బొడ్డు సత్యారావు, లక్ష్మి, సతీష్, రాజా, నాగు, సోములు, మూర్తి, రాము నాయుడు, తిరుపతి రావు, గెడ్డం రమణ, సెక్రటరీ బల్ల సురేష్, సత్తిబాబు, నాయుడు, జిలకర లక్ష్మణ్ కుమార్ మరియు తెలుగుదేశం నాయకులు బిజెపి నాయకులు జనసేన నాయకులు కూటమి కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దృవ పత్రాల పరిశీలన

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విశ్వేశ్వర నాయుడు



**పాడేరు,పెన్ పవర్, ఆగస్టు 24:** అల్లూరి సీతారామ రాజు జిల్లాలో జూలై 10వ తేదీన విడుదల చేసిన ఆశా వర్కర్ పోస్ట్ ల నోటిఫికేషన్ కు సంబంధించి ప్రొవిజినల్ గా సెలెక్ట్ కాబడిన పాడేరు డివిజన్ 11 మండలాలకు సంబంధించిన అభ్యర్దినులకు సబ్ కలెక్టర్ , పాడేరు వారి కార్యాలయం నందు ఆగష్టు 26వ తేదీ మంగళవారం ఉదయం 10.00 గంటలనుండి ఇంటర్వ్యూస్ జరుగనున్నవి ప్రొవిజినల్ గా సెలెక్ట్ కాబడిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావలసినదిగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజా ఉద్యమా నేతకు ఘన నివాళులు అర్పించిన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు



**పాడేరు,పెన్ పవర్,ఆగస్టు24:**

రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆదివాసీ ఉద్యమా నేతా,%ఙూ% మరియు %ర్రా+=% వ్యవస్థాపకుడు లికీ"శే డాక్టర్ చెండా ఏలీయా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్నా రాత్రి తుది శ్వాస విడిచారు.. ఈ మరణ వార్త తెలుసుకుని వారి స్వగ్రామం హుకుంపేట మండలం తడిగిగి గ్రామంలో వారి అంతక్రియల్లో హాజరైనా పాడేరు ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు లిమత్స్యరాస విశ్వేశ్వర రాజు.చెండా ఏలీయా పార్థివ దేహాన్ని పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.

ఒక ఉపాధ్యాయుడుగా కొనసాగుతూ ఒకవైపు గిరిజన ప్రాంత ప్రజల హక్కులు, చట్టాలు కోసం సంఘం నాయకుడుగా ప్రభుత్వాలతో పోరాడి గిరిజనుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన ఆ మహోన్నతమైన వ్యక్తి అలాంటి ఉద్యమా నేతా మన మధ్య లేకపోవడం తీరని లోటు అని గుర్తుచేశారు, ఆయన మరణం జీర్ణించుకోలేనిది ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటూ నివాళులు అర్పించారు.

దుఃఖంతో ఉన్నా వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఈ కార్యక్రమంలో శాసన సభ్యులతో పాటు వైసీపీ పాడేరు మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, కాడేలి సర్పంచ్ వనుగు బసవన్న దొరా, పలు గిరిజన మరియు ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

# జనసేన నాయకులుగా నియామకం




**శంఖవరం, పెన్ పవర్, ఆగస్టు 24:**
శంఖవరం మండలంలోని కొంతంగి పంచాయతీ పరిధిలో జనసేన పార్టీ కీలక నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా కొంతంగి గ్రామానికి శరణం జయబాబు, కొత్తూరు గ్రామానికి తోకలు కిరణ్‌ను పార్టీ ముఖ్య నాయకులుగా నియమించారు. ఈ నియామకంతో గ్రామాల్లో పార్టీ శక్తి మరింత బలపడుతుందని, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి వీరు ముందుండి కృషి చేస్తారని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్తగా నియమించబడిన నాయకులకు గ్రామ కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని, భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదిగి, తమ గ్రామాలకు మంచి పేరు తెచ్చిపెట్టాలని ప్రజలు ఆకాంక్షించారు. ఈ నియామకాలు జనసేన పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపాయని, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# వడ్లమూరులో కరెంటు స్తంభాలపై నిర్లక్ష్యం...



**కపిలేశ్వరపురం : పెన్ పవర్ ఆగస్టు 24.** కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు మెయిన్ రోడ్ ను ఆనుకుని ఉన్న విద్యుత్ స్థంబాల పర్యవేక్షణలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌కు అనేక విద్యుత్ తీగలను పాదులు ఎక్కి స్తంభాలపై చుట్టేయడం వల్ల ప్రమాదకర పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఈ తీగలకు విద్యుత్ ప్రవహిస్తే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన లైన్‌మెన్లు నిర్లక్ష్యం చూపుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే జరిగే ప్రమాదాలకు విద్యుత్ శాఖ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని వడ్లమూరు ఎంపీటీసీ పలివెల మధు హెచ్చరించారు.

# చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్

- జనసేన నాయకుల హర్షం



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 24:**కూటమి ప్రభుత్వం చింతూరు ఏరియా ఆసుపత్రిని 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయడం పట్ల చింతూరు జనసేన పార్టీ మండల నాయకులు ఘనంగా స్వాగతించారు. ఈ నిర్ణయంతో ఏజెన్సీ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక కల నెరవేరిందని, భవిష్యత్తులో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని వారు అన్నారు. జనసేన నాయకులు మాట్లాడుతూ, చింతూరులో 100 పడకల హాస్పిటల్ ఏర్పడటం చారిత్రాత్మక నిర్ణయం. ఇప్పటివరకు ప్రజలు పెద్ద పట్టణాలకు వెళ్లి కష్టాలు పడేవారు. ఇకపై అటువంటి ఇబ్బందులు ఉండవు. వైద్య రంగం అభివృద్ధికి ఇది గొప్ప అడుగు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కుర్ల రాజశేఖర్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, ఉపాధ్యక్షులు తీగల రవి, సీనియర్ నాయకులు పయ్యాల నాగేశ్వరరావు, వీర మహిళలు తిగల కవిత, రమణమ్మ, ఎం. సతీష్ మండల నాయకులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# సురవరం మృతి తీరని లోటు

**కుక్కునూరు,పెన్ పవర్,ఆగస్టు 24 :** కమ్యూనిస్టు యోధుడు సీపీఐ అగ్రనేత మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి మృతి వామపక్ష ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె.లక్ష్మయ్య అన్నారు.ఈ సందర్భంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.వామపక్ష భావజాలంతో విద్యార్థి దశ నుంచే సామాజిక రంగంలోకి అడుగుపెట్టిన సురవరం సుధాకర్ భారత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారని,చివరి శ్వాస వరకు ప్రజా పోరాటాల్లో భాగస్వామిగా నిలిచిన ఆయిన సేవలు పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తి దాయకమన్నారు.ప్రకటన చేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా. శ్యామల,అయితా.సురేష్ బాబు,కురాకుల బాబూరావు, మైసాక్షి.వెంకటాచారి,మడిపల్లి.రమణయ్య,వరసా. పాపారావు ఉన్నారు.

# ఆటో డ్రైవర్లు కు భద్రతా సూచనలు

**కుక్కునూరు,పెన్ పవర్, ఆగస్టు 24 :** కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి ఆదివారం నాడు స్థానిక ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత అలాగే ట్రాఫిక్ నిబంధనలపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా,ఆటో డ్రైవర్లు రహదారి నియమాలను ఖచ్చితంగా పాటించాలని,అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను నివారించాలని ఆయన సూచించారు.అలాగే, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, వాహనాలను సరైన స్థితిలో నిర్వహించాలని,డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని ఆయన సూచించారు.

# తోటగరువు శ్రీ మురళీకృష్ణ ఉత్సవ నూతన కార్యవర్గం




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం ఆగస్టు 23:** తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ పరిధి10,11,12, వార్డుల పరిధిలో గల తోటగరువు గ్రామ పెద్దల సూచన సహకారులతో ఆదివారం తోటగరువు శ్రీ మురళీకృష్ణ ఉత్సవ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.
తోటగురువు గ్రామంలో జరిగే అన్ని పండుగలు శ్రీమురళీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాలని గ్రామ పెద్దలు నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ తీర్మానించింది.ఇకపై తోటగరువు గ్రామంలో జరిగే అన్ని పండుగలు సదరు గ్రామ పెద్దలు యువత మరియు నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ తీర్మానాలకు ప్రజలు సహకరించాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు.గ్రామ పెద్దల సూచనలు సలహాలతో
నూతన కమిటీ కలిసి నడుస్తుందని కమిటీ తీర్మానించింది.
గ్రామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు గా మన్యాల మహేష్.అధ్యక్షులు మొల్లి.
ఉపాధ్యక్షులు ఒమ్మి పోలిరాజు కార్యదర్శి మొల్లి వెంకటరమణ.సహాయ కార్యదర్శి ఒమ్మి శ్రీను. కార్యా నిర్వహణ కార్యదర్శి ఒమ్మి రాంబాబు. కోశాధికారి ఒమ్మి చిట్టీబాబు. సహ కోశాధికారి ఒమ్మి హరికృష్ణ.లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులకు గ్రామ పెద్దలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# చెండాఏలియా మాస్టారుకు ఘన నివాళి



**ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు.**

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 24:**-ఆదివాసీ పార్టీ ఓపిజిఆర్ మరియు డిఎల్ఓ వ్యవస్థాపకుడు చెండా ఏలియా మాస్టర్ కు భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 80వ దశకంలో విశాఖ ఏజెన్సీలో గిరిజన హక్కుల కోసం పోరాడేందుకు తన సహచరులతో కలిసి గిరిజన హక్కుల పరిరక్షణ సంస్థ(ఓ పి జి ఆర్)ను ఆదివాసీల కోసం ప్రత్యేకంగా దండకారణ్య రాష్ట్రం కావాలని దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్(డిఎల్ఓ) లను ఏర్పాటు చేసి, ఆదివాసీల పక్షాన ఆదివాసీల ప్రక్షాళన కోసం ప్రత్యక్షంగా పోరాటం చేసిన ఉద్యమకారుడు చెండా ఏలియా మాస్టర్ అన్నారు. ఆయన అకాల మరణం ఆదివాసీలకు తీవ్రమైన నష్టమని , ఆయన లేని లోటు యావత్తు గిరిజన సమాజం జీర్ణించుకోలేకపోతుందన్నారు. ఆయన చూపించిన స్ఫూర్తితో ఆదివాసీలు తమ హక్కులు చట్టాలు రక్షించుకోవడానికి కృషి చేయాలని, అప్పుడే ఆయన ఆశయాలకు, ఆత్మకు నిజమైన నివాళులర్పించినట్లుని ఆయన అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు దేవుడు ఆదరణ ఇవ్వాలని ఆయన ఉద్యమ ఆశయాలు నెరవేరాలని ఆ దిశగా గిరిజనులు కృషి చేయాలని రాజబాబు ఆకాంక్షించారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..




వీరంశెట్టి సతీష్

**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు24:**మట్టి వినాయకుడిని పూజిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. అనే నినాదంతో పంచాయతీ రాజ్ జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్యం రాంబాబు అన్నారు.
ఇరుసుమండ గ్రామంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమలను కోనసీమ ఆహారనిధి ఫౌండర్ వీరంశెట్టి సతీష్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబుచే ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, తెలుగుదేశం నాయకులు డివి సత్యనారాయణ, అక్కిశెట్టి పెద్దపలువురు నాయకులు పాల్గొన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రతి ఇళ్లలో మట్టి విగ్రహాలను పూజించాలని పర్యావరణాన్ని కాపాడాలని ఫౌండర్ వీరంశెట్టి సతీష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆహారనిధి ప్రతినిధులు బండారు సురేష్, పోలిశెట్టి పవన్ మహేష్, వేదుల్లపల్లి అయ్యప్ప స్వామి, రంకిరెడ్డి శ్రీనివాస్, రోళ్ళ హనుమంతు రావు పాల్గొన్నారు

# రేపు పీసా చట్టంపై క్షేత్రస్థాయి సమావేశం



**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 24 :** మండలంలో మంగళవారం రెండు గ్రామ పంచాయితీలలో పీసా చట్టంపై క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.
ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు ఎర్రవరెడ్డి పాలెం పంచాయితీలోనూ, మధ్యాహ్నం రెండు గంటలకు దాలిపాడు పంచాయతీలోనూ పీసా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పిసా కార్యక్రమా కి ఐటీడీఏ లీగల్ సెల్ అడ్వైజర్ పల్లా త్రినాధరావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ, సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, కార్మికులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు హాజరుకావాలని పత్రికా ప్రకటనలో ఎంపీడీవో తెలియజేశారు.

# కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులను అభినందించిన ఎస్పీ డి.నరసింహ కిషోర్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, ఆగస్ట్ 24:**జిల్లాలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుళ్ళుగా ఎంపికైన నలుగురు హోంగార్డులను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు. జిల్లా పోలీసుశాఖలో హోంగార్డులుగా పని చేస్తూ, ఇటీవల రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుళ్ళుగా ఎంపికైన నలుగురు హోంగార్డులను ఎస్పీ ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ వారికి శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ పైగల అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయితీతో పని చేసి, పోలీసు శాఖకు మరింత మంచి పేరు తేవాలని, విధుల్లో నిబద్ధతతో పని చేసి, ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించాలని సూచించారు.
కానిస్టేబుళ్ళుగా ఎంపికైన హోంగార్డులు పి.వి.వెంకట సురేష్, కే.సతీష్, కే.శ్రీను, వై.భీమరాజు లను ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించిన వారిలో ఉన్నారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్.బి.ఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏ.వి.సుబ్బరాజు, జోనల్ డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారత్‌ను దూరం చేసుకోవడం అమెరికాకు చేటు!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మాజీ విదేశాంగ మంత్రి జాన్ కెర్రీ, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ చేసిన వ్యాఖ్యలు భారత్-అమెరికా సంబంధాల ప్రాముఖ్యతను మరింతగా ఎత్తిచూపాయి. భారత్ లాంటి వ్యూహాత్మక మిత్రదేశాన్ని అమెరికా దూరం చేసుకోవడం సరికాదని వారు హెచ్చరించారు. జాన్ కెర్రీ తాజాగా మాట్లాడుతూ.. "అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దౌత్యంలో సహకారం కంటే ఆదేశాలు, ఒత్తిడి ఎక్కువ చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. భారత్, అమెరికా వంటి మహా దేశాలు ప్రజలకు అల్టిమేటంలు ఇవ్వడం ద్వారా కాదు, పరస్పర గౌరవంతో, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి. ఒబామా పాలనలో సహకారం ప్రధానంగా ఉండేది. కానీ ఇప్పుడు విభేదాలు పెరుగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు.

**నిక్కీ హేలీ సూచన**

రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ట్రంప్ చేసిన అభ్యంతరాలను భారత్ సీరియస్‌గా తీసుకోవాలని నిక్కీ హేలీ సూచించారు. "అమెరికా-భారత్ మధ్య ఉన్న దశాబ్దాల స్నేహం, విశ్వాసం ఇలాంటి ఒడిదుడుకులను అధిగమించే బలమైన పునాది. వాణిజ్యం, చమురు వంటి అంశాల్లో బలమైన చర్చలు జరగాలి. చైనాను ఎదుర్కోవడంలో అమెరికాకు భారత్ మిత్రుడిగా ఉండటం అత్యంత కీలకం" అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ. యువ జనాభాతో భవిష్యత్తులో చైనాను అధిగమించగలదు. ఇలాంటి మిత్రదేశాన్ని ఆంక్షలతో, ఒత్తిడితో దూరం చేసుకోవడం అమెరికాకు విపత్కరం అవుతుంది" అని వ్యాఖ్యానించారు.

**ట్రంప్ వైఖరిపై విమర్శలు**



రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులపై అమెరికా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. "ఈ చమురు సొమ్ము ఉక్రెయిన్ యుద్ధానికి ఉపయోగపడుతోందని" ట్రంప్ సలహాదారు పీటర్ నవారో ఆరోపించారు. అంతేకాక భారత్ దిగుమతులపై ట్రంప్ 25 శాతం పెనాల్టీలు విధించడం ఉద్రిక్తతలకు దారి తీసింది. దీనిపై భారత వాదన ఏమిటంటే చమురు ధరలు పెరిగితే 150 కోట్ల మంది ప్రజలపై భారం పడుతుంది. తమ అవసరాల కోసం చమురు కొనుగోలు చేయడం తప్పు కాదని న్యూఢిల్లీ స్పష్టం చేస్తోంది. భారత్-అమెరికా సంబంధాలు కేవలం వ్యాపార, వాణిజ్య అంశాలకే పరిమితం కావు. ఇవి వ్యూహాత్మక భాగస్వామ్యం, భద్రతా సహకారం, ప్రజాస్వామ్య విలువలపై ఆధారపడి ఉన్నాయి. ఇలాంటి సమయంలో ట్రంప్ విధానాలు ఉద్రిక్తతలకు దారితీస్తే, చైనాకు మాత్రమే లాభం చేకూరుతుంది. భారత్‌ను మిత్రదేశంగా నిలుపుకోవడం అమెరికాకు కూడా అత్యంత అవసరం అని నిపుణులు ఏకాభిప్రాయంతో చెబుతున్నారు.

# ఈసీకి షాక్: బీహార్‌లో ఇద్దరు పాక్ పౌరులకు ఓటు హక్కు!




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు నిప్పులు చెరు గుతున్న విషయం తెలిసిందే. బతికి ఉన్నవారి ఓట్లు తీసేస్తున్నారని, చచ్చిపోయిన వారి ఓట్లు ఉంచుతున్నారని.. ఒకే వ్యక్తికి నాలుగు చోట్ల ఎన్నికల గుర్తింపు కార్డులు ఇచ్చారని, %-%జీరో%-% డోర్ నెంబరుతో వేలాది ఓట్లు ఇచ్చారని ఇలా.. అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని ఇండియా కూటమి ఆరోపిస్తోంది. అంతేకాదు.. బీహార్‌లో అయితే.. 65 లక్షల ఓట్లను తొలగించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్ద ఉద్యమమే చేస్తున్నారు. %-%ఓట్ అధికార్ యాత్ర%-% పేరుతో 13 వేల కిలో మీటర్లు, 22 జిల్లాల్లో కవర్ చేసేలా యాత్రను ప్రస్తుతం కొనసా గిస్తున్నారు. ఓట్లను చోరీ చేస్తున్నారని, తమకు అనుకూలంగా ఉన్నవారిని చేరుస్తూ.. కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీలకు అనుకూలంగా ఉన్నారని భావిస్తున్న ఓటర్లను తొలగిస్తున్నారని రాహుల్‌గాం ధీ సహా ఇతర పక్షాల నాయకులు నిప్పులు చెరుగుతున్నారు. అయితే.. దీనికి సమాధానం చెప్పని ఎన్నిక ల సంఘం.. ఎదురు ఆరోపణలు సంధించింది.. అఫిడవిట్లు కోరింది. కుదరకపోతే.. క్షమాపణలు చెప్పాలని కూడా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా బీహార్‌లో సంచలన విషయం వెలుగు చూసింది. ఇద్దరు పాకిస్థాన్ పౌరులకు ఇక్కడ ఓటు హక్కు కల్పించారు. పోనీ.. వారేమన్నా.. పాక్ వదిలేసి వచ్చి ఉంటున్నారా? అంటే.. లేదు. ఒకరు 3 మాసాల వీసాపై 1956లో వచ్చి దొంగచాటుగా ఇక్కడే ఉంటున్నారు. మరొకరు మూడేళ్ల వీసాపై వైద్యం కోసం ఇటీవల వచ్చారు. కానీ, వీరి వివరాలు పరిశీలించకుండానే గుడ్డిగా ఎన్నికల సంఘం వీరికి ఓటు హక్కు కల్పించింది. తాజాగా ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగు చూడగానే కేంద్ర హోం శాఖ హుటాహుటిన స్పందించింది.

**ఏం జరిగింది?**

పాకిస్థాన్‌కు చెందిన మహిళలు.. ఇమ్రానా ఖానమ్ అలియాస్ ఇమ్రానా ఖాటూన్, మరొకరు ఫిర్దోషియా ఖానమ్ అనే మహిళలకు తాజాగా ఓటరు కార్డులు ఇచ్చారు. వీటిపై చుట్టుపక్కలవారికి అనుమానం వచ్చి.. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

ఇవి జోరుగా వైరల్ అయ్యాయి. వెంటనే స్పందించిన కేంద్ర హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి..భాగల్పూర్ జిల్లాలోని భికన్‌పూర్‌లో స్థిరపడ్డారని గుర్తించింది. వెంటనే వీరి ఓట్లను తొలగించాలని ఆదేశించింది. దీనిపై ఎన్నికల సంఘం ఎప్పటిలానే మౌనంగా ఉండిపోయింది.

# కన్నీళ్లు పెట్టిన కిమ్: రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో అరుదైన సంఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని అత్యంత కఠినమైన నియంతలలో ఒకరైన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ సైనికుల మరణంపై తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బహిరంగంగానే కన్నీళ్లు పెట్టుకుని, అమరవీరుల కుటుంబాలను ఓదార్చడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఈ సంఘటన కిమ్‌లో ఒక మానవీయ కోణాన్ని ప్రపంచానికి చూపించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరపున పోరాడుతున్న ఉత్తర కొరియా సైనికుల మృతదేహాలకు నిర్వహించిన సైనిక గౌరవ సత్కార కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం కనిపించింది.

**సైనికుల త్యాగానికి కిమ్ జోంగ్ ఉన్ కన్నీళ్లు**



రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో తమ దేశానికి మద్దతుగా ఉత్తర కొరియా వేలాది మంది సైనికులను పంపినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ సైనికులలో వందలాది మంది ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఇటీవల, మరణించిన సైనికుల మృతదేహాలను ప్రత్యేక విమానాల ద్వారా ఉత్తర కొరియాకు తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో కిమ్ జోంగ్ ఉన్ పాల్గొన్నారు. అమరవీరుల చిత్రాల ముందు మోకాళ్లపై కూర్చుని పతకాలను ఉంచి ఆయన బోరున విలపించారు. ఒక అమరవీరుడి చిన్నారి కుమార్తె నుదిటిపై ముద్దు పెట్టి, ఆమెను ఓదార్చడం అక్కడ ఉన్నవారందరినీ కదిలించింది.

**కఠినమైన నియంతలో మానవీయ కోణం**

కిమ్ జోంగ్ ఉన్ తన క్రూరమైన పాలనకు, కనికరం లేని శిక్షలకు పేరుగాంచారు. గతంలో ఆయన తన ప్రత్యర్థులను, కుటుంబ సభ్యులను కూడా బహిరంగంగా ఉరితీయించిన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి కఠినమైన నియంత బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకోవడం చాలా అరుదు. గతంలో ఆయన దేశంలో జననాల రేటు తగ్గుదల గురించి ప్రసంగిస్తున్నప్పుడు, తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణించినప్పుడు కూడా కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి సైనికుల మరణంపై ఆయన చూపిన భావోద్వేగం, వారి కుటుంబాలను ఓదార్చడం, ఆయనలో ఒక మానవీయ కోణాన్ని ప్రదర్శించింది. ఇది అంతర్జాతీయంగా విస్తృత చర్చకు దారితీసింది.

**బలపడుతున్న రష్యా-ఉత్తర కొరియా బంధం**

ఈ సంఘటన రష్యా, ఉత్తర కొరియా మధ్య బలపడుతున్న స్నేహాన్ని కూడా స్పష్టం చేస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఆయుధాలు, సైనికులను పంపించడం ద్వారా కిమ్ జోంగ్ ఉన్ రష్యాకు తన నిబద్ధతను ప్రదర్శించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఉత్తర కొరియా సైనికులను 'హీరోలు'గా అభివర్ణించారు. రష్యా, ఉత్తర కొరియా మధ్య రక్షణ ఒప్పందాలు మరింత బలపడటానికి ఈ సంఘటన ఒక నిదర్శనంగా మారింది. ఈ కన్నీళ్లు ఒక నిజమైన భావోద్వేగమా లేక రాజకీయ వ్యూహమా అనే చర్చలు నడుస్తున్నప్పటికీ, కిమ్ జోంగ్ ఉన్ తీసుకున్న ఈ అసాధారణ చర్య ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.

# జగన్ రూటే సపరేటు.. మరోసారి కీలక నిర్ణయాలతో రూట్ పైకి ప్రతిపక్ష నేత



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ పటంలో మార్పులు మొదలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం వైసీపీని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలను అమలు చేస్తోంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ పార్టీ ఎన్డీయే అభ్యర్థికి మద్దతిస్తుండడంతో కొత్త లెక్కలు ప్రారంభమయ్యాయి. కూటమిలో ఉన్న మూడు పార్టీలు దేనికదే పార్టీ కేడర్ ను స్ట్రాంగ్ చేసుకునేందుకు ప్రణాళికలు వేస్తుంది. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ సమావేశాలకు జగన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తి రేకెత్తిస్తోంది.

**సెప్టెంబర్ 17 నుంచి సభ..!**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష హోదాలో ఉండేందుకు జగన్ సమ్మతించలేదు. సీట్ల సంఖ్య చాలా తక్కువగా ఉన్నాయి కాబట్టి ప్రధాన ప్రతిపక్ష హోదా ఆయన పార్టీకి దక్కలేదు. కానీ ఇటీవల తనకు ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలని డిమాండ్ చేశారు. అది ఇస్తేనే వస్తానని రావడం లేదు. పార్టీ పెద్ద అసెంబ్లీకి రాకుంటే తాము వెళ్లి సాధించేదేంటని పార్టీకి చెందిన మిగతా ఎమ్మెల్యేలు రావడం లేదు. వర్షాకాలం సమావేశాలు సెప్టెంబర్ 17 నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం సూత్ర ప్రాయంగా చెప్తోంది. అసెంబ్లీ సమావేశాలపై సెప్టెంబర్ 4వ తేదీ కేబినెట్ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.


**ఈ సారి జగన్ హాజరవుతారా..?**

రాష్ట్ర ప్రజలు, పార్టీ కేడర్ కోరిక మేరకు జగన్ కూడా హాజరవుతానని పార్టీ కేడర్ నుంచి సమాచారం అందుతోంది. ఏపీలో ప్రభుత్వం ఏర్పాటు చేసి 15 నెలలు కావడంతో ప్రభుత్వ వైఫల్యాలను సభలో ప్రస్తావించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. 15 నెలలుగా తనపై వస్తున్న ఆరోపణలను ఈ సమావేశాలకు హాజరై ఖండించాలని మాజీ సీఎం అనుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే అమరావతి విషయంలో కూడా జగన్ యూ టర్న్ తీసుకున్నట్లు పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది. మూడు రాజధానులకు ప్రజా మద్దతు లేకపోవడంతో ఆలోచనను మార్చుకున్నట్లు చెప్తున్నారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు జగన్ సిద్ధం అయ్యారా..?**

ప్రభుత్వం కూడా ఎవరైనా ప్రతిపక్ష నేతకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాలని యోచిస్తోంది. రాజధాని నిర్మాణం, భూ సేకరణ, తదితర విషయాలను ప్రజలకు ఎలా వివరించాలన్నదానిపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇక జగన్ రాజధానిలోని లోపాలతో పాటు లిక్కర్ కేసులో అరెస్ట్ లాంటి విషయాలను ప్రధానంగా మాట్లాడుతారని తెలుస్తోంది. ఏది ఏమైనా జగన్ యూ టర్న్ తీసుకున్నాడా..? దీంతో ప్రజలకు దగ్గరవ్వనున్నాడా..? అన్న సందేహాలు వినిపిస్తున్నాయి.

# జ్ఞానానికే అంకితమైన జీవితం..



**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటక రాష్ట్రం శ్రీరంగపట్టణం తాలూకా హరళహళ్లిలో ఒక ప్రత్యేకమైన ఇల్లు ఉంది. సాధారణంగా అది ఇల్లు మాత్రమే కాదు, లక్షలాది పుస్తకాలతో నిండిన జ్ఞాన భాండాగారం. పరిశోధకులు, రచయితలు, ఉపాధ్యాయులు, విమర్శకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ఎప్పుడూ కిటకిటలాడే ఈ స్థలం.. నిజంగా ఒక సజీవ విశ్వవిద్యాలయంలా అనిపిస్తుంది.

ఇక్కడ నవలలు, సాహిత్యం, పురాణాలు, విజ్ఞానం, టెక్నాలజీ, సినిమాలు, క్రీడలు ఇలా ఏ రంగమైనా పుస్తకం లభిస్తుంది. 8 విదేశీ భాషల్లోనూ, 22 భారతీయ భాషల్లోనూ సుమారు 15 లక్షల పుస్తకాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. ఈ మహా సంపదను సేకరించింది ఒక్కరే మండ్య జిల్లా కెన్నాళ్లు గ్రామానికి చెందిన అంకేగౌడ (76).

**పుస్తకాలపై పుట్టిన మక్కువ**

కాలేజీ రోజుల్లో పుస్తకాలు సులభంగా దొరకకపోవడంతో, "నాకు సొంతంగా పుస్తకాలు ఉండాలి" అనే ఆలోచన అంకేగౌడలో చిగురించింది. ఆ చిన్న కోరిక క్రమంగా అతని జీవిత లక్ష్యమైంది. 21 ఏళ్ల వయసులో మొదలైన ఈ పుస్తకాల సేకరణ, ఇప్పుడు ఐదు దశాబ్దాల మహాయజ్ఞంగా మారింది.

**కష్టాల్లోనూ పుస్తకాల కోసం కృషి**

మండ్య చక్కెర పరిశ్రమలో 30 ఏళ్లు కార్మికుడిగా పనిచేసిన అంకేగౌడ, తన జీతంలో 80 శాతం పుస్తకాలకే ఖర్చు పెట్టేవారు. కొందరు దాతలు, పాఠకులు కూడా సహాయం చేస్తూ తమ వద్ద ఉన్న పుస్తకాలను ఇస్తుంటారు. అయినప్పటికీ, ఈ ప్రైవేట్ గ్రంథాలయం నడవడానికి సహాయకులను పెట్టుకునే స్థోమత లేకపోవడంతో, కుటుంబ సభ్యులే నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

**పుస్తకాల ఇల్లు - ప్రజల గ్రంథాలయం**

ప్రతిరోజూ స్వయంగా పుస్తకాలను శుభ్రం చేయడం, సక్రమంగా పేర్చడం %-% ఇవన్నీ అంకేగౌడే చేస్తారు. పాఠకుల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, తన ఇల్లు జ్ఞానాన్ని పంచే గృహమయ్యేలా చూసుకుంటున్నారు. సమాజంలో చాలా మంది తమ సొంత ఆస్తులు, భవనాలు సేకరించడానికి జీవితాన్ని అర్పిస్తారు. కానీ అంకేగౌడ మాత్రం పుస్తకాలకే జీవితాన్ని అంకితం చేశారు. ఆయన కృషి వల్ల హరళహళ్లిలోని ఈ పుస్తకాల ఇల్లు, పుస్తక ప్రియులకు ఒక ఆశ్రయం, పరిశోధకులకు ఒక ఆభరణం, తెలుగు సహా అనేక భాషల అభ్యాసకులకు ఒక వరం అయింది.

# విశాఖ సభ జనసేన భవిష్యత్తు వ్యూహాలకు నాంది కాబోతున్నదా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం జనసేన, తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ కలిసి అధికారంలో ఉన్నప్పటికీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ప్రత్యేక రాజకీయ గుర్తింపును నిలుపుకోవాలనే ఆలోచనలో ఉన్నారనే తెలుస్తున్నది. కొంతమంది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం కూడా ఇదే. 2029 ఎన్నికల సమీకరణలను దృష్టిలో పెట్టుకుని, జనసేన తన వ్యూహాలను ఎటువంటి మార్పులు చేస్తుందో అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. అయితే ఆ ప్రశ్నకు సమాధానం మరో వారంలో దొరకవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**15 వేల మంది జన సైనికులు..**

ఆగస్టు 30న విశాఖ నగరంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహాసభ నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 15 వేల మంది జనసైనికులు, వీరమహిళలు తరలిరానున్నారు. పవన్ పుట్టినరోజు వేడుకలతో పాటు ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీయనుంది.

**దిశానిర్దేశం చేయబోతున్నారా?**

ఈ మహాసభలో ప్రధానంగా పార్టీ భవిష్యత్ దిశపై పవన్ కళ్యాణ్ ఎలాంటి సందేశం ఇస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది. ఆయన ప్రత్యేకంగా 12 కమిటీలను ఏర్పాటు చేసి, అన్ని ఏర్పాట్లు పర్యవేక్షణలో పెట్టడం ద్వారా ఈ సమావేశానికి ఇచ్చే ప్రాధాన్యత స్పష్టమవుతోంది. కాగా, జన సైనికులు మాత్రం, ఈ సభ ద్వారా పార్టీ కొత్త పంథాలో అడుగులు వేస్తుందా? లేక ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతుందా? అన్న సందేహాలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు. ఇక పవన్ కళ్యాణ్‌కు ఉన్న సినీ క్రేజ్ కూడా ఈ సభకు మరింత ప్రాధాన్యం చేకూర్చుతున్నది. గ్యాంగ్ స్టర్ రోల్ లో ఆయన నటించిన ఓజీ చిత్రం విడుదలకు ముందే ఈ సభ జరగడం, ఇది రాజకీయంగా మాత్రమే కాకుండా సినీ వర్గాల్లో కూడా చర్చకు దారితీస్తున్నది. అభిమానులలో ఒక వర్గం ఆయన నుంచి ఊహించి సర్‌ప్రైజ్ ఉంటుందని భావిస్తున్నది. మొత్తం మీద, ఈ విశాఖ మహాసభ పవన్ కళ్యాణ్ వ్యక్తిగత పుట్టినరోజు వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో వచ్చే దశాబ్దానికి దిశా నిర్ధేశం చేసే వేదికగా నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

# దుడుమా జలపాతం విషాదం: ప్రాణాలను బలిగొన్న రీల్స్ మోజు



**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్నిసార్లు సరదాగా మొదలైన పనులు తీరని విషాదాన్ని మిగులుస్తాయి. ఇటీవల ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో ఉన్న ప్రసిద్ధ దుడుమా జలపాతం వద్ద జరిగిన విషాదకర సంఘటన కూడా అలాంటిదే. కేవలం కొన్ని వ్యూస్, లైకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన ఒక యువ యూట్యూబర్ విషాదాంతం చెందాడు.

**ఏం జరిగింది?**

ఒడిశా రాష్ట్రంలోని సుంకి ప్రాంతానికి చెందిన ప్రముఖ యూట్యూబర్ సగర్, తన స్నేహితులతో కలిసి దుడుమా జలపాతాన్ని సందర్శించాడు. సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్ కోసం ఒక ఆసక్తికరమైన వీడియో లేదా రీల్స్ తీయాలనే ఉద్దేశంతో అతను జలపాతం మధ్యలో ఉన్న ఒక బండరాయిపైకి వెళ్ళాడు. చూడటానికి చాలా ప్రమాదకరంగా కనిపించే ఆ ప్రదేశంలో, అతను జాగ్రత్తగా నిలబడి వీడియో చిత్రీకరణ మొదలుపెట్టాడు. అయితే, విధి వక్రించింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న జలపాతం ఒక్కసారిగా ఉధృతమైంది. పైన కురిసిన వర్షాల వల్ల నీటి ప్రవాహం అకస్మాత్తుగా పెరిగింది. ఈ అనూహ్య ప్రవాహంలో సగర్ తన సమతుల్యం కోల్పోయి జారిపడిపోయాడు. ఆ సమయంలో అతడి స్నేహితులు, అక్కడున్న పర్యాటకులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కళ్లముందే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన సగర్‌ను రక్షించలేక వారంతా నిస్సహాయంగా ఉండిపోయారు.

**గాలింపు చర్యలు.. దొరకని ఆచూకీ**

ఈ సంఘటనతో అక్కడున్న వారంతా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే పోలీసులకు, రెస్క్యూ టీమ్‌లకు సమాచారం అందించారు. అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని, గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఆ ప్రాంతం చాలా లోతుగా ఉండటం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టంగా మారాయి. అధికారులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, సగర్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

**సోషల్ మీడియాలో చర్చ**

ఈ విషాదకర సంఘటన గురించి తెలిసిన తర్వాత, సోషల్ మీడియాలో తీవ్ర చర్చ మొదలైంది. నెటిజన్లు, ఇతర కంటెంట్ క్రియేటర్లు ఈ ఘటనపై తమ స్పందనలు తెలియజేశారు. చాలామంది ప్రాణాల కంటే కంటెంట్ గొప్పది కాదని, లైకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టడం అవివేకమని అభిప్రాయపడ్డారు."కేవలం కొన్ని లైకుల కోసం ఇలా ప్రాణాలను పోగొట్టుకోవడం చాలా బాధాకరం. యువత ఇలాంటి ప్రమాదకర ప్రదేశాల్లో వీడియోలు చేయడం మానుకోవాలి." "ప్రాణాలు అమూల్యమైనవి. కంటెంట్ క్రియేటర్లు తమ సురక్షితకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటివి మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి." ఇలాంటి కామెంట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున షేర్ అవుతున్నాయి.

**సురక్షితమే ముఖ్యం: ఇది ఒక హెచ్చరిక**

ఈ సంఘటన కేవలం ఒక విషాదం మాత్రమే కాదు, సోషల్ మీడియాలో ప్రచారం కోసం ప్రాణాలను రిస్కులో పెడుతున్న యువతకు ఇది ఒక గట్టి హెచ్చరిక. వ్యూస్, లైకులు తాత్కాలికమే కానీ, ప్రాణాలు శాశ్వతమైనవి. ఒక వీడియో తీసే ముందు, అది ఎంత రిస్క్‌గా ఉంటుందో ఆలోచించుకోవాలి. ముఖ్యంగా ప్రకృతి ప్రదేశాలైన జలపాతాలు, నదులు, కొండలు వంటి చోట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు, కానీ దాని శక్తిని తక్కువ అంచనా వేయకూడదు.

చివరగా, గుర్తుంచుకోండి.. మీ ప్రాణాల కంటే విలువైన కంటెంట్ ఏదీ లేదు. సురక్షితంగా ఉండండి!

# ఈ ఎయిర్ ఇండియా విమానాలకు ఏమైంది?




**హైదరాబాద్ పెన్ పవర్:** విమాన ప్రయాణాల్లో ఒకప్పుడు దేశంలో అత్యున్నత సంస్థగా పేరు పొందిన ఎయిర్ ఇండియా.. ప్రస్తుతం వరుస సాంకేతిక లోపాలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా గత వారం రోజుల్లో చోటుచేసుకున్న మూడు ఘటనలు ఈ సంస్థ నిర్వహణపై తీవ్ర సందేహాలకు తావిస్తున్నాయి.

**ముంబై-జోధ్‌పూర్ విమానంలో తీవ్ర గందరగోళం**

శుక్రవారం ఉదయం ముంబై నుంచి జోధ్‌పూర్ బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎయిర్‌బస్ %ూా%319 సాంకేతిక లోపం కారణంగా టేకాఫ్ రద్దు చేసుకుంది. ముంబై టెర్మినల్%-%2 నుంచి 9:15 గంటలకు బయలుదేరాల్సిన ఈ విమానంలో 110 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే, టేకాఫ్ సమయంలో కాక్‌పిట్ సిబ్బంది ఒక ఆపరేషనల్ లోపాన్ని గుర్తించారు. భద్రతా కారణాల దృష్ట్యా విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఈ ఘటనతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం ఎదురైంది. విమానం నిలిపివేసిన తర్వాత, ప్రయాణికులను విమానం నుంచి దింపి, మళ్లీ సెక్యూరిటీ చెక్ ద్వారా పంపాల్సి వచ్చింది. ఆ తర్వాత వారికి ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేశారు. కొత్త విమానం మధ్యాహ్నం 12:36 గంటలకు బయలుదేరింది. ఈ అనూహ్య ఘటన కారణంగా ప్రయాణికులు దాదాపు 3 గంటల 30 నిమిషాల ఆలస్యంతో గమ్యస్థానానికి చేరుకున్నారు.

**వారం రోజులలో మూడో ఘటన**

ముంబై-జోధ్‌పూర్ ఘటన ఎయిర్ ఇండియాకు వారం రోజుల్లో ఇది మూడోది కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతకు ముందు ఆగస్టు 17న ఢిల్లీ నుంచి లేహ్‌కు, ముంబై నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లాల్సిన విమానాలు కూడా సాంకేతిక సమస్యల కారణంగా రద్దు అయ్యాయి. ఈ రెండు ఘటనల్లోనూ ప్రయాణికులు 4 నుంచి 6 గంటల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా జ్యూరిచ్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఒక విమానం కూడా సాంకేతిక లోపం కారణంగా రద్దు చేయబడింది. ఇలాంటి వరుస ఘటనలు ఎయిర్ ఇండియా భద్రతా ప్రమాణాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

**టాటా గ్రూప్‌కు పెను సవాల్**

ప్రస్తుతం టాటా గ్రూప్ ఆధ్వర్యంలో ఉన్న ఎయిర్ ఇండియా తమ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఆధునికీకరణ, సేవల నాణ్యత పెంపుపై దృష్టి పెట్టింది. అయితే తరచుగా తలెత్తుతున్న సాంకేతిక లోపాలు ఈ ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయి. ప్రయాణికుల నమ్మకాన్ని పునరుద్ధరించాలంటే, ఎయిర్ ఇండియా కఠినమైన నిర్వహణ తనిఖీలు, భద్రతా ప్రమాణాలపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని విమానయాన రంగ నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే, ఈ ఘటనలు సంస్థ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉంది. ప్రయాణికుల భద్రత, సమయపాలన విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే, ఎయిర్ ఇండియాకు భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.

# భారత క్రికెట్ లో ఓ శకం ముగిసింది... దిగ్గజ క్రికెటర్ రిటైర్మెంట్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ లో వాల్ అంటే రాహుల్ ద్రవిడ్.. 16 ఏళ్లు అతడు జట్టు బ్యాటింగ్ కు ఓ మూలస్తంభంగా నిలబడ్డాడు. అతడు రిటైర్మెంట్ సమయానికి అలాంటి మరొక బ్యాట్స్ మన్ దేశానికి అవసరమయ్యాడు. కానీ, ఎవరు దొరుకుతారు..? అని చూస్తే.. ద్రవిడ్ స్థానం తనదేనంటూ ఓ క్రికెటర్ ముందుకొచ్చాడు. పదేళ్లకు పైగా బ్యాటింగ్ భారాన్ని మోశాడు. నాలుగేళ్లుగా జట్టుకు దూరమైన అతడు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించాడు. అచ్చం ద్రవిడ్ తరహాలోనే చెక్కుచెదరని డిఫెన్స్ తో జట్టుకు పెట్టని కోటలా నిలిచిన అతడు ఇక ఆట చాలించాడు.

**నయ వాల్ తొలగింది...**

టెస్టు బ్యాట్స్ మన్ చతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకొన్నాడు. అన్ని ఫార్మాట్లకు అతడు రిటైర్మెంట్ ప్రకటించాడు. వాస్తవానికి పుజారా టెస్టుల్లో మాత్రమే ఉన్నాడు. వన్డేలకు అతడిని ఎప్పుడూ పరిగణించలేదు. ఒకటీ, రెండు అవకాశాలు ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదు. ఇప్పుడు టెస్టుల నుంచి కూడా తప్పుకొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగుతున్నట్లు ఆదివారం ప్రకటన చేశాడు. టీమ్ ఇండియా జెర్సీ ధరించడం, మైదానంలో జాతీయగీతం ఆలాపన, జట్టు కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం తన జీవితంలో మధురానుభూతలని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

**రాజ్ కోట్ నుంచి...**

గుజరాత్ లోని రాజ్ కోట్ నగరానికి చెందిన పుజారా సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడాడు. ఇప్పుడు అదే సంగతి గుర్తుచేసుకుంటూ.. రాజ్ కోట్ కుర్రాడు దేశానికి ఆడాడు అనే కల నెరవేరిందని, రాష్ట్రం, దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం అని పేర్కొన్నాడు. తన కెరీర్ ఎదుగుదలకు సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ ఎంతో సాయం చేసిందని చెప్పుకొచ్చాడు. ఇక మీదట మరింత సమయం కుటుంబానికి కేటాయిస్తానని తెలిపాడు.

**వందకు పైగా టెస్టుల్లో...**

పుజారా దేశానికి 103 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించాడు. 2010లో ఆస్ట్రేలియాపై తొలి టెస్టు ఆడాడు. 22 సెంచరీలు (ఇందులో మూడు డబుల్ సెంచరీలు), 35 హాఫ్ సెంచరీలు చేశాడు. మొత్తం 7,195 పరుగులు చేశాడు. పూర్తిగా టెస్టు బ్యాట్స్ మన్ గా ముద్ర పడిన పుజారా ఐదు వన్డేలే ఆడాడు. 51 పరుగులు సాధించాడు. 2023లో ఆస్ట్రేలియాపైనే చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు.

**ఫామ్ కోల్పోయి.. జట్టుకు దూరమై..**

2018-19 ఆస్ట్రేలియా టూర్ లో 1200 పైగా బంతులను ఎదుర్కొని మూడు సెంచరీలు సహా అద్భుతంగా రాణించిన పుజారా ఆ తర్వాత 2021-21 టూర్ లోనూ రాణించాడు. ఓ టెస్టులో 200 పైగా బంతులు ఆడి హాఫ్ సెంచరీ చేశాడు. ఈ రెండు సిరీస్ లను భారత్ గెలుచుకోవడం గమనార్హం. అయితే, పుజారా బ్యాటింగ్ మరీ నెమ్మదిగా సాగుతుండడం, ఇటీవలి కాలంలో దూకుడైన ఆట ఉన్న కుర్రాళ్లు దూసుకురావడంతో పుజారాకు జట్టులో చోటు కష్టమైంది. రెండేళ్ల కిందట ఆస్ట్రేలియాతో ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్లో ఆడిన పుజారాను మళ్లీ సెలక్టర్లు కరుణించలేదు. దీంతో 37 ఏళ్ల పుజారా క్రికెట్ కు వీడ్కోలు పలికాడు.

**నాలుగో క్రికెటర్...**

ఈ ఏడాది జనవరిలో ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, స్టార్ బ్యాట్స్ మెన్ విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టెస్టులకు గుడ్ బై చెప్పారు. ఇప్పుడు పుజారా వంతు.

# సమస్య వాళ్లతోనే అంటున్న చంద్రబాబు.. ఇంతకీ వాళ్లెవరు..?



**హైదరాబాద్ పెన్ పవర్:** సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేతల్లో చంద్రబాబు మొదటి వాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తన మామ దివంగత నందమూరి తారక రామారావు హయాంలో పార్టీ పనులు చూసుకుంటూ.. ఆ తర్వాత పార్టీలో కీలక రోల్ ప్లే చేసి సీఎంగా పదవి చేపట్టిన ఆయన ఉమ్మడి రాష్ట్రానికి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసి రికార్డు సృష్టించారు. పార్టీ, పాలనను సమర్థవంతంగా నిర్వహించే నేతగా కూడా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ఆ తరానికి ఈ తరానికి వారధిగా కూడా చంద్రబాబు నిలుస్తారు. అందుకేనేమో వృద్ధులకు ఎలాంటి పథకాలు కావాలి. యంగ్ స్టర్స్ కు ఎలాంటి పథకాలు కావాలో ఆయన తెలిసినంతగా బహుషా మరో నేతకు తెలియదేమో. ఇదే కాదు గీత దాటితే ఎవరిని ఎలా కంట్రోల్ చేయాలో కూడా ఆయనకు వెన్నతో పెట్టిన విద్యే. క్రమ శిక్షణకు మారు పేరుగా నిలుస్తున్న చంద్రబాబును చూసి సీనియర్ నాయకులు కూడా వణికిపోతుంటారంటే సందేహం లేదు.

**గీత దాటుతున్న వారిపై నిఘా..**

ఇటీవల పార్టీలో వివాదాలు మొదలయ్యాయి. తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో బాబు సీరియస్‌గా ఉన్నారని తెలుస్తోంది. పార్టీలో గొడవలు తెచ్చే నేతలకు పలు మార్లు హెచ్చరికలు కూడా జారీ చేశారట. రీసెంట్ గా గీత దాటుతున్న ఎమ్మెల్యేలకు సంబంధించిన బాబు కీలకమైన వ్యాఖ్యలు చేశారట. పార్టీలోని సీనియర్ నాయకులకు క్రమ శిక్షణ గురించి తెలిసే ఉంటుందని అందుకే వారు నిబంధనల మేరకు నడుచుకుంటారని, కొత్తగా ఎన్నికైన వారు కొంత బాధ్యతారాహిత్యంతో ఉంటున్నారని ఆయన అన్నారు. ఇలాంటి 35 మంది ఎమ్మెల్యేలను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు.


**ఇటీవల 35 మంది ఎమ్మెల్యేలతో సమావేశం..**

35 మంది ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి తన వ్యవహారం గురించి చెప్పుకచ్చారు. 'ఎవరైనా సరే గాడి తప్పుతున్నట్లు అనిపిస్తే ఒకసారి పిలిచి చెప్తాను.. పద్ధతి మార్చుకోకుంటే మరోసారి పిలిచి చెప్తాను.. అయినా మార్చుకోకుంటే.. మూడో సారి కఠినంగా వ్యవహరిస్తా.. అయితే రెండో సారి మూడో సారి పిలవాలా? వద్దా? అనేది వారి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది' అని చెప్పారు. అయితే బాబు వార్నింగ్ ఇస్తారు కానీ.. చర్యలు తీసుకోరు అన్న వారు కూడా లేకపోలేదు. గీత దాటుతున్నారని తెలిసిన తర్వాత వార్నింగ్ లు ఏంటి? వారిని ఎందుకు ఉపేక్షించాలంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**వార్నింగ్ లు వద్దు.. యాక్షన్ కావాలంటున్న నేతలు..**

పార్టీ పేరు చెడగొడుతున్న వారికి వార్నింగ్ లు ఏంటని, చేతల్లో చూపించాలని సీనియర్ నాయకులు బాబుకు సూచిస్తున్నారు. కొత్తగా ఎన్నికైన వారిలో ఇవన్నీ తాటాకు చప్పుళ్లలా ఉంటాయని, యాక్షన్ లోకిదిగిన తర్వాతే మిగతా వారు భయపడతారని కొందరు అంటున్నారు. కఠినంగా వ్యవహించాలని కోరుతున్నారు.

# భారత్ - చైనా వాణిజ్యంలో పెరుగుదల



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, చైనాల మధ్య వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో (ఏప్రిల్-జూలై), భారత్ నుంచి చైనాకు ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలపడుతున్నాయని స్పష్టం చేస్తోంది.

**ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల**

అధికారిక గణాంకాల ప్రకారం, ఏప్రిల్ నుంచి జూలై వరకు భారత్ నుంచి చైనాకు ఎగుమతులు 20 శాతం పెరిగి %వి%5.76 బిలియన్లకు (సుమారు రూ.50,112 కోట్లు) చేరుకున్నాయి. ఈ పెరుగుదల గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే స్థిరంగా ఉంది. మే నెలలో అత్యధికంగా %వి%1.63 బిలియన్ల ఎగుమతులు నమోదయ్యాయి, ఇది భారత్ వాణిజ్య వృద్ధికి సానుకూల సంకేతం.

**ముఖ్య రంగాల్లో వృద్ధి**

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనాలో భారతీయ ఉత్పత్తుల డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా కొన్ని కీలక రంగాల్లో అసాధారణమైన వృద్ధి కనిపించింది. పెట్రోలియం ఉత్పత్తులు దాదాపు రెట్టింపు పెరిగి %వి%883 మిలియన్లకు చేరుకున్నాయి. ఎలక్ట్రానిక్స్ మూడు రెట్లు పెరిగి %వి%521 మిలియన్లకు చేరాయి. రసాయనాలు 16.3% వృద్ధితో %వి%335.1 మిలియన్లకు పెరిగాయి. జెమ్స్ అండ్ జ్యువెలరీ 72.7% పెరుగుదలతో అత్యధిక వృద్ధి సాధించాయి. ఈ గణాంకాలు భారత్ ఎగుమతుల సామర్థ్యం బలోపేతం అవుతోందని, అంతర్జాతీయ మార్కెట్లో భారత్ పోటీ పడుతోందని సూచిస్తున్నాయి.

**దిగుమతులు, దౌత్య సంబంధాలు**

భారత్ చైనా నుంచి దిగుమతులు కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక వస్తువుల కోసం కొనసాగుతున్నాయి. ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా జరగడం, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ సంబంధాలు మరింత బలపడతాయని సూచిస్తున్నాయి.

ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల మధ్య కూడా భారత్-చైనా వాణిజ్యం కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఈ వృద్ధి ధోరణి కొనసాగితే, రాబోయే రోజుల్లో ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు మరింత స్థిరపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# టెస్టుల్లో నా క్రికెటింగ్ ఐడల్ అతనే.. దిగ్గజాలకు షాక్ ఇచ్చి యంగ్ ప్లేయర్‌కు ఓటేసిన ఆర్య




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 సీజన్ లో తన బ్యాటింగ్ తో వెలుగులోకి వచ్చిన యంగ్ క్రికెటర్ ప్రియాంష్ ఆర్య చెన్నై సూపర్ కింగ్స్‌పై 43 బంతుల్లో సెంచరీ చేసి ఒక్కసారిగా టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిన ఈ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ ఓవరాల్ గా ఈ సీజన్ లో 179 స్ట్రైక్ రేట్‌తో 475 పరుగులు చేసి అదరగొట్టాడు. భవిష్యత్ లో టీమిండియాలోకి రావడానికి అన్ని అర్హతలు ఉన్న ఈ 24 ఏళ్ళ యంగ్ బ్యాటర్.. టెస్ట్ క్రికెట్ లో తన ఐడల్ ఎవరో చెప్పుకొచ్చాడు. సాధారణంగా క్రికెటింగ్ ఐడల్ అంటే దిగ్గజ క్రికెటర్ల పేర్లు చెబుతారు. కానీ ఆర్య మాత్రం ప్రస్తుతం టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ పేరు చెప్పుకొచ్చాడు.

ఆర్య మాట్లాడుతూ.. "నేను రెడ్-బాల్ క్రికెట్ ఆడాలనుకున్నా నా అరంగేట్రం ఇంకా జరగలేదు. ఈ సంవత్సరం రెండ్ బాల్ క్రికెట్ లో ఆడడం జరుగుతుందని ఆశిస్తున్నాను. నేను రంజీ ట్రోఫీలో ఆడాలనుకుంటున్నాను. నేను ఇంతకు ముందు చెప్పినట్టు రాబోయే దేశీయ సీజన్ ఆడడానికి ఆసక్తి చూపిస్తున్నాను. నేను అండర్-19, అండర్-23 క్రికెట్‌లలో చాలా రెడ్-బాల్ క్రికెట్ ఆడాను. కాబట్టి ఈ ఫార్మాట్ ఆడడం నాకు కొత్త విషయం కాదు. రంజీ ట్రోఫీ చాలా కఠినమైనది. పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. మ్యాచ్‌లు ఉదయం ప్రారంభమవుతాయి. ఇది సవాలుతో కూడుకున్నది. రెండ్ బాల్ క్రికెట్ లో శుభ్‌మాన్ గిల్ నాకు ఆదర్శం" అని ఆర్య చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 లో అదరగొట్టిన ప్రియాంష్ ఆర్య ఇప్పుడు టెస్ట్ క్రికెట్ లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఒ పెల్ కంటే ముందు ప్రియాంష్ ఆర్య ఢిల్లీ ప్రీమియర్ లీగ్ లో 6 బంతుల్లో 6 సిక్సర్లు బాదేసి సంచలనంగా మారాడు. భారత క్రికెట్ లో యువరాజ్ సింగ్ తర్వాత ఆరు బంతులకు ఆరు సిక్సర్ల కొట్టిన ప్లేయర్ గా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్ లో మొత్తం 39 బంతుల్లోనే సెంచరీ చేసుకున్న ప్రియాంష్.. 50 బంతుల్లో 120 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత ఐపీఎల్ 2025 సీజన్ లో ఆర్య ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా నిలిచాడు.

# సౌరవ్ గంగూలీకి హెడ్ కోచ్ బాధ్యతలు.. ఏ జట్టుకు అంటే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి హెడ్ కోచ్ పదవి వరించింది. 2026 సీజన్‌కు ముందు గంగూలీ ప్రిటోరియా క్యాపిటల్స్‌కు ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. ఆదివారం (ఆగస్టు 24) మాజీ బీసీసీఐ చీఫ్ గంగూలీ.. ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ జోనాథన్ ట్రాట్ స్థానంలో గంగూలీ హెడ్ కోచ్ బాధ్యతలు స్వీకరిస్తాడు. ట్రాట్ శనివారం (ఆగస్టు 23) ప్రిటోరియా క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా పదవి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. "ప్రిన్స్ క్యాపిటల్స్ శిబిరంలో చేరడానికి సిద్ధంగా ఉన్నాడు. గంగూలీని మా కొత్త ప్రధాన కోచ్‌గా ప్రకటించడానికి మేము చాలా సంతోషంగా ఉన్నాము". అని సెంచూరియన్ ఫ్రాంచైజీ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది. గంగూలీ క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి. 2018, 2019 మధ్య గంగూలీ ఐపీఎల్ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌కు జట్టు డైరెక్టర్‌గా ఉన్నారు. బీసీసీఐ అధ్యక్షుడైన తర్వాత ఆ పదవి నుంచి వైదొలిగాడు. 2025 సౌతాఫ్రికా 20 సీజన్‌కు ముందు ట్రాట్ ప్రధాన కోచ్‌గా విఫలమయ్యాడు. 10 మ్యాచ్ ల్లో కేవలం రెండు విజయాలు మాత్రమే సాధించి నాకౌట్‌కు చేరుకోలేకపోయింది. ఆరు జట్ల ఆడబోయే సౌతాఫ్రికా టీ20 లీగ్ లో పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో నిలిచింది. ప్రిటోరియా క్యాపిటల్స్ విల్ జాక్స్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, ఆండ్రీ రస్సెల్ ను రిటైన్ చేసుకుంది. సౌతాఫ్రికా టీ20 మెగా లీగ్ నాలుగో ఎడిషన్ కు రంగం సిద్ధమైంది. ఇప్పటివరకు ఈ లీగ్ మూడు సీజన్ లు జరిగింది. రెండు సార్లు సన్ రైజర్స్ ఈస్టర్న్ క్యాపిటల్స్ టైటిల్ విజేతగా నిలిచింది. 2025 సీజన్ లో ఎంఐ కేప్ టౌన్ తొలిసారి ఛాంపియన్ గా అవతరించింది. ఎప్పటిలాగే మొత్తం ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్,జోబర్గ్ సూపర్ కింగ్స్,పార్ల్ రాయల్స్, ఎంఐ కేప్ టౌన్,డర్బన్ సూపర్ జెయింట్స్,ప్రిటోరియా క్యాపిటల్స్ ఫ్రాంచైజీలు తమ రిటైన్ ప్లేయర్ల జాబితాను ప్రకటించారు.

# సిరీస్ గెలిచినా చిత్తుగా ఓడారు.. సౌతాఫ్రికా వన్డే చరిత్రలో అతి పెద్ద ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో సౌతాఫ్రికా ఘోరంగా ఓడిపోయింది. మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో భాగంగా చివరి వన్డేలో 276 పరుగుల తేడాతో చిత్తు చిత్తుగా ఓడిపోయింది. ఆదివారం (ఆగస్టు 24) మెకే వేదికగా గ్రేట్ బారియర్ రీఫ్ అరీనాలో ముగిసిన ఈ మ్యాచ్ లో ఓడిపోయిన సౌతాఫ్రికా తమ వన్డే కెరీర్ లో అతి పెద్ద ఓటమిని చవిచూసింది. వన్డే క్రికెట్ చరిత్రలో ఇది రెండో అతి పెద్ద ఓటమి. ఈ సిరీస్ లో తొలి రెండు వన్డేల్లో గెలిచిన సౌతాఫ్రికా 2-1 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది. ట్రావిస్ హెడ్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్.. కేశవ్ మహరాజ్ కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు లభించాయి. 432 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 24.5 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌట్ అయింది. లక్ష్యం భారీగా ఉండడంతో మొదటి నుంచి వేగంగా ఆడాలని చూసిన సౌతాఫ్రికా 50 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి మ్యాచ్ పై ఆశలు వదిలేసుకుంది. ఈ సమయంలో బ్రెవిస్, జార్జి కాసేపు మెరుపు మెరిపించారు. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు. 49 పరుగులు చేసిన బ్రెవిస్ టాప్ స్కోరర్ కాగా.. మిగిలిన వారందరూ విఫలమయ్యారు. కూపర్ కొన్నోల్లీ 5 వికెట్లు తీసి సఫారీలను తన స్పిన్ మాయాజాలంతో చిత్తు చేశాడు. జేవియర్ బార్ట్‌లెట్, అబాట్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి ఏకంగా 431 పరుగులు చేసింది. జట్టులో ఏకంగా ముగ్గురు సెంచరీలు కొట్టడం విశేషం. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (140), మిచెల్ మార్ష్(100) సెంచరీలతో విజృంభిస్తే.. ఆ తర్వాత కెమరూన్ గ్రీన్ (118) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హెడ్ 103 బంతుల్లోనే 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 140 పరుగులు చేశాడు. మరోవైపు మార్ష్ 106 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 100 పరుగులు చేశాడు. పవర్ హిట్టింగ్ తో దుమ్ములేపిన గ్రీన్ కేవలం 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. క్యారీ 37 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్ కు అజేయంగా 164 పరుగులు జోడించడం విశేషం.




# ఆది ఖాతాలో మరో భారీ ప్రాజెక్టు?



టాలీవుడ్ టాలెంటెడ్ నటుడు ఆది పినిశెట్టి గురించి సౌత్ ఆడియన్స్ కు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. డైరెక్టర్ రవిరాజా పినిశెట్టి కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆది, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి విభిన్న పాత్రలను ఎంచుకుంటూ ఎన్నో ప్రయోగాలు చేస్తూ వచ్చిన ఆది రీసెంట్ గా మయసభ వెబ్ సిరీస్ లో కనిపించి ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకున్నారు.

**అఖండ2లో విలన్‌గా ఆది పినిశెట్టి**

ఇప్పటికే నటుడిగా తన సత్తా ఏంటో ప్రూవ్ చేసుకున్న ఆది పినిశెట్టి ఇప్పుడు భారీ బడ్జెట్ సినిమాలపై ఫోకస్ చేశారు. అందులో భాగంగానే ఇప్పటికే అఖండ2 తాండవం ను చేస్తున్నారు ఆది. బాలయ్య- బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న అఖండ2 లో ఆది విలన్ గా నటిస్తున్నారు. ఇప్పుడు అఖండ2తో పాటూ ఆది మరో బిగ్ బడ్జెట్ సినిమాలో అవకాశం అందుకున్నట్టు తెలుస్తోంది.

**కార్తీ సినిమాలో ఆది**

అయితే ఈ సారి ఆది నటిస్తోంది తెలుగు సినిమాలో కాదు. కార్తీ హీరోగా తమిజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మార్షల్ అనే సినిమాలో. వాస్తవానికి ఆది ఇప్పుడు నటించనున్న క్యారెక్టర్ కోసం గతంలో నవీన్ పౌలీని అనుకున్నారు. అయితే మార్షల్ లో ఆది చేయబోయే క్యారెక్టర్‌కు నెగిటివ్ షేడ్స్ ఉంటాయని, సినిమాలో ఆది చేయబోయే క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుందని సమాచారం.

**మార్షల్ లో నాని స్పెషల్ రోల్**

ఈ సినిమాలో ఆదితో పాటూ పలువురు మలయాళ ఇండస్ట్రీకి చెందిన నటులు కూడా నటించనుండగా కళ్యాణి ప్రియదర్శన్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదే సినిమాలో టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని కూడా ఓ స్పెషల్ రోల్ లో కనిపిస్తారంటున్నారు కానీ దీనిపై ఎలాంటి కన్ఫర్మేషన్ లేదు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోన్న ఈ సినిమాకు సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, వచ్చే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com